
# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మంజుల దాసు

తెలంగాణ బుధవారం, 25 - జూన్ - 2025 సంపుటి : 16 సంచిక : 332 పేజీలు 08 వెల : 6/-

# కష్టపడితేనే పదవులు..

- నామినేటేడ్ పదవులను వెంటనే భర్తీ చేయండి
- పార్టీపై మంత్రులు దృష్టి సారించాలి
- 'జూబ్లీహిల్స్'కు అభ్యర్థి ని అధిష్టానమే ప్రకటిస్తుంది
- కష్టపడితేనే పదవులు మరో పదేండ్లు అధికారం మనదే
- ప్రభుత్వం, పార్టీ జోడెద్దుల్లా పని చేస్తున్నాయి : టీపీసీసీ నూతన కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యత ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులదేనని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాల్లో నామినేటెడ్ పదవులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై మంత్రులు దృష్టి సారించాలని సూచించారు. పార్టీ బలంగా ఉంటేనే తిరిగి అధికారంలోకి వస్తామని తెలిపారు. కష్టపడిన వారికి పదవులు తప్పకుండా వస్తాయనీ, పని చేయకుంటే నిర్దాక్షిణ్యంగా తొలగిస్తామని చెప్పారు. త్వరలో రానున్న స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకుంటేనే పార్టీ బలోపేతమవు తుందని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక కోసం పార్టీ అధిష్టానమే అభ్యర్థిని ప్రకటిస్తుందని తెలిపారు. 'ఎవరైనా తానే అభ్యర్థిని అనుకుంటే అది మీ ఇష్టమే' అని వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, టీపీసీసీ సలహా కమిటీ సమావేశాల్లో సీఎం దిశానిర్దేశం చేశారు. ఆ తర్వాత టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన నూతన కార్యవర్గ సమావేశంలో సీఎం మాట్లాడారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో ఆలస్యం చేయెద్దనీ, వెంటనే జిల్లాల్లో పదవులు భర్తీ చేయాలని మంత్రులను కోరారు.

మిగతా 8లో..

# చర్చకు రా.. తేల్చుకుందాం!

- నీటి వాటాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- తేదీ ఖరారు చేసుకొని స్పీకర్‌కు కేసీఆర్ లేఖ రాయాలి
- ఆధారాలన్నీ సభ ముందుంచుతా
- తెలంగాణ ద్రోహులు.. గోదావరి దొంగలెవరో తేలుద్దాం
- ఆయనిచ్చిన బోడి సలహాలతోనే రాష్ట్రానికి దరిద్రం
- రైతు నేస్తం సభలో సీఎం రేవంత్‌రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

గోదావరి, కృష్ణా నదీజలాల్లో రాష్ట్రవాటాల విషయంపై అసెంబ్లీలో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నీతి, నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే ఈ చర్చలో భాగస్వామి కావాలని సవాలు విసిరారు. 'ఆయనకు వీలైన రోజు అసెంబ్లీని సమావేశప ర్చమని కోరుతూ స్పీకర్‌కు లేఖ రాయాలనీ, ఆ రోజు అన్ని ఆధారాలను సభ ముందు ఉంచి చర్చి స్తామన్నారు. బనకచర్లపై బీఆర్ఎస్ బండారాన్ని బయటపెడతామని చెప్పారు. ఒకరోజు గోదావరి పై, మరోరోజు కృష్ణా నదీ జలాల వాటాలపై చర్చిద్దామన్నారు. మంగళవారం నాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "గోదావరి జలాల్లో తెలంగాణకు ద్రోహం చేసిందెవరు? కోట్లాది రూపాయలు దోచుకున్నదెవరు? 3 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నాయనీ, రాయలసీమకు తరలించుకోమని కేసీఆర్ చెప్పాకే, 2016లో ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. హంద్రీనీవాకు 400 టీఎంసీలు తరలించేందుకు 2016లో ప్రాజెక్ట్ రిపోర్ట్, జీవో, 2018లో వాప్కోస్ సంస్థ నియామకం జరిగాయని వివరించారు. కేసీఆర్ ఇచ్చిన బోడీ సలహాలు, దిక్కుమాలిన సూచనలతోనే రాష్ట్రానికి దరిద్రం దాపురించిందని ఘాటుగా విమర్శించారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 800కు పైగా టీఎంసీలు తెలంగాణకు కేటాయిస్తే, 299 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన కేసీఆర్, వాటిని కూడా పూర్తిగా వాడుకోకుండా తెలంగాణ రైతాంగానికి శాశ్వతంగా మరణశాసనం రాశారని చెప్పారు. దీనికి సంబంధించిన సంతకాలు, ఆధారాలతో సహా అసెంబ్లీకి వస్తానన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పేంటో సభలో కేసీఆర్ నిరూపించాలని సవాలు విసిరారు. పదేండ్లలో ధనిక రాష్ట్రం దివాళా తీస్తే, కేసీఆర్ కుటుంబం ఏ విధంగా శ్రీమంతులయ్యారో చెప్పాలని నిలదీశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.2 లక్షల కోట్లను కాంట్రాక్టర్లకు కట్టబెట్టి, ఉమ్మడి రాష్ట్రంలో మొదలెట్టిన ప్రాజెక్టులేవి పూర్తి చేయలేదని విమర్శిం చారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, సీతారామ, దేవాదుల ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి తెలంగాణను ఎడారిగా మార్చారన్నారు. 18 నెలల కాలంలో కాంగ్రెస్ పాలనలో రూ.ఒక లక్షా 4 వేల కోట్లు ఖర్చు చేసి వ్యవసాయాన్ని పండుగ చేశామన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, స్ప్రింక్లర్లు, సోలార్ గిరి వికాసంలో పంపుసెట్లు, ధాన్యం కొనుగోళ్లు, సన్నాలకు బోనస్, రైతు రుణమాఫీ సహా అన్నీ అమలు చేశామన్నారు. అభివృద్ధిలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామనీ, వారికి ఉచిత బస్సు ప్రయాణం, ఎలక్ట్రిక్ బస్సులు, పెట్రోల్ బంకులకు యాజమాన్య హక్కులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు

మిగతా 8లో..

# రైల్వే టికెట్ ధరలు పెంపు

జులై 1 నుంచి అమలు

న్యూఢిల్లీ : రైల్వే టికెట్ ధరలు పెరగనున్నాయి. జులై 1 నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. నాన్ ఏసీ మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల టికెట్ ధర కిలోమీటరుకు 1 పైసా, ఏసీ తరగతి టికెట్ ధర కిలోమీటర్‌కు 2 పైసలు చొప్పున పెరగనున్నాయని రైల్వే వర్గాలు తెలిపాయి. సబర్బన్ టికెట్ ధరలు, 500 కిలోమీటర్ల వరకు సెకండ్ క్లాస్ ప్రయాణానికి ఈ పెంపు వర్తించదు. 500 కిలోమీటర్లు దాటితే కిలోమీటరుకు ఒక పైసా చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌పై ఇటీవలే రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆధార్ అథంటికేషన్ ఉన్న వారికి తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. జులై 1 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. ఏసీ క్లాస్ బుకింగ్‌ల కోసం ఉదయం 10 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు, నాన్ ఏసీ క్లాస్ బుకింగ్‌లకు ఉదయం 11 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు అవకాశం ఉంటుంది. ఈ మార్పులు అమలులోకి వచ్చిన రోజు నుంచే (జులై 1) టికెట్ల ధర పెరుగుదల కూడా అమల్లోకి రానున్నట్టు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. నెలవారీ సీజన్ టికెట్ ధరల్లోనూ ఎలాంటి మార్పూ ఉండబోదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# ఉగ్రవాదుల్లాగా నా పై నిఘా పెట్టారు

మా కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు

సిట్ ఎదుట హాజరయిన బిజెపి ఎంపి ఈటెల రాజేందర్, ప్రేమేందర్‌రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

దేశ ద్రోహులు, ఉగ్రవాదులు, అసాంఘీక శక్తులపై నిఘా ఉంచినట్టుగా గత ప్రభుత్వం నాపై నిఘా పెట్టి ఫోన్లు ట్యాప్ చేయించిందని సీనియర్ నేత, మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మంగళవారం సిట్ ఎదుట హాజరైయి తన వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, విచారణ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు. ఫోన్ ట్యాప్ అయిన తన ఫోన్ నెంబర్ల జాబితాను సిట్ అధికారులు తెలిపారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసి వ్యక్తిగత స్వేచ్ఛను హరించిందని మండిపడ్డారు. నాడు ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించి ప్రజల స్వేచ్ఛను హరిస్తే, గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌తో వ్యక్తుల స్వేచ్ఛను హరించిందని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. మా కుటుంబ సభ్యులు, గన్‌మెన్లు, డ్రైవర్లు, రాజకీయ

మిగతా 8లో..

# విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి

మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతు భరోసా పేరిట ఆడుతున్న డ్రామాలు ఆపి, 19 నెలల కాలంలో రైతన్నను అరిగోస పెట్టుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు రూ.15,000 చొప్పున ఇస్తామని చెప్పి రూ.12,000కి పరిమితం చేయడం మోసం చేయడమే అని, గత వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగిలో ఎగ్గొట్టి, ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం రైతులను మోసం చేయడమే అని పేర్కొన్నారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత అని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టావు అధికారంలోకి వచ్చాక నిండా ముంచావు.. రైతులకు ఏం చేశావని సంబరాలు చేస్తున్నావు అని సిఎం రేవంత్ రెడ్డిని అడిగారు. రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా..రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా..రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా..అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందుకా..1200 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించినందుకా ప్రీమియం చెల్లించక రైతు బీమా అమలు ప్రశ్నార్థకం చేస్తున్నందుకా..పంట బీమా అని చెప్పి ఉసురుమనిపించినందుకా దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా..లగచర్ల, రాజోలి రైతుల చేతులకు బేడీలు వేసినందుకా ఏడాదిన్నర పాలనలో ఒక్క చెరువు నింపకుండా, ఒక్క చెక్ డ్యాం కట్టకుండా, కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వనందుకా..ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరపనందుకా..జనుము, జీలుగు విత్తనాల ధరలు పెంచి, రైతులకు సకాలంలో అందించినందుకా.. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అటకెక్కించినందుకా మీ దుర్మార్గ పాలనలో 511 మంది

మిగతా 7లో..

# ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితం

లక్షకుపైగా ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్

గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోందని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం ఒక ఇంటి కోసం 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తోందనీ,ఈ ప్రయోజనాన్ని పూర్తిస్థాయిలో లబ్ధిదారులు పొందే విధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు దాదాపు మూడు లక్షల ఇండ్లు మంజూరు చేయగా, ఇందులో 2.37 లక్షల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కూడా అందజేశామని తెలిపారు. 1.03 లక్షల ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయనీ, వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 22,500 కోట్ల రూపాయలతో నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా ఉందన్నారు. ఈ నెల 23 వరకు గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రంలో 88 నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఇండ్లను మంజూరు చేయడం, గ్రౌండింగ్ చేయడంలో సూర్యాపేట, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, వికారాబాద్, సిద్దిపేట, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల పనితీరు మరింత మెరుగుపడాలని సూచించారు. తక్షణమే ఆయా జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న పనులపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.

since: 2007
# టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
బుధవారం,
25-06-2025


## జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిరసన



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

కాంగ్రెస్ నేత పైడిమల నర్సింగ్ సోమవారం సోషల్ మీడియా వేదికగా జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం పట్టణ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు అందరూ కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ, కాంగ్రెస్ నేత పైడిమల్ల నర్సింగ్ పట్టణంలోని పాత బస్టాండ్ పోలీస్ ట్రాఫిక్ అవుట్ పోస్ట్ నకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా, దానిపై వార్తా కథనాన్ని ప్రచురించడంతో సోషల్ మీడియా వేదికగా సదరు కాంగ్రెస్ నేత పైడిమల్ల నర్సింగ్ జర్నలిస్టులను, పత్రికలను కించ పరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. వెంటనే కాంగ్రెస్ నేత పైడిమల్ల నర్సింగ్ పై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ సైతం నర్సింగ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ విషయమై రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సైతం స్పందించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల నిరసనకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా నాయకులు మద్దతు తెలియజేస్తూ, నిరసనలో పాల్పంచుకున్నారు. ఈకార్యక్రమంలో పట్టణంలోని జర్నలిస్టులు, టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## నాగులంచ రైతు వేదికలో రైతు భరోసా సంబరాలు



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

మండల పరిధిలోని నాగులవంచ రైతు వేదికలో రైతు భరోసా సంబరాలు ఘనంగా జరిగినాయి. రైతులు ముఖ్యమంత్రి ప్రసంగాన్ని, మంత్రుల ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. తరువాత రైతు భరోసా సంబరాలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బి కళ్యాణి, కార్తీక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర రావు, మాజీ సర్పంచ్ ఆలస్యం నాగమణి, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య, ఆలస్యం బసవయ్య, మద్దినేని వెంకటేశ్వరరావు ,ఎల్లంపల్లి సతీష్ ,ముత్తినేని వెంకటేశ్వరరావు ,ఆలస్యం శ్రీను , వెచ్చ మంగపతి రావు, కోలేటి పెద్ద బ్రహ్మం, కొత్తపల్లి బసవయ్య, నన్నక నాగేశ్వరరావు,కొరివి వీరయ్య , వంకాయలపాటి గోపాలరావు ,కందిమల్ల రామారావు,తన్నీరు వెంకటేశ్వర్లు,ఏసు పోగు గోపయ్య , అంబాల వెంకన్న, పాతర్లపాడు, తిరుమలాపురం, తిమ్మినేనిపాలెం ,చిన్న మండవ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా జెండా పండుగ జరపాలి

### జిల్లా ఇన్చార్జ్ కందకట్ల విజయ మాదిగ.



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

చింతకాని మండలం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమీక్ష సమావేశం లచ్చగూడెంలో నిర్వహించడం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి రవీంద్ర మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జ్ కందికట్ల విజయ మాదిగ గ మాట్లాడుత చింతకాని మండలంలో అన్ని గ్రామాల్లో తక్షణమే గ్రామ కమిటీలు నిర్వహణ చేయాలని, అలాగే ఎమ్మార్పీఎస్ గద్దెలు లేని గ్రామాలను తక్షణమే గుర్తించి గద్దెల నిర్మాణం 100% పూర్తి చేసి,జూలై 7న వర్గీకరణ సాధించుకున్న తర్వాత కృష్ణ మాదిగ పోరాట ఫలితానికి, ఎమ్మార్పీఎస్ విజయోత్సవానికి సంకేతంగా జూలై 7న ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణలు మరియు కృష్ణ మాదిగ పుట్టినరోజును అంగరంగ వైభవంగా జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్రా ఉపేందర్, మండల ఎం ఎస్ పి అధ్యక్షుడు కట్టా వెంకటేశ్వర్లు ఎరుకల, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు చాట్ల రాజేష్ మాదిగ, వేర్పుల హరికృష్ణ, కుక్కల దిలీప్, కుక్కల శ్రీకాంత్, తుంగ ఆదం, జలపల్లి మధు, పగిడిపల్లి నాగేశ్వరరావు, గద్దల మహేష్, పగిడపల్లి శివ, గుర్రం రాజేష్, సంపంగి బాలకృష్ణ, గుండె జాని, పల్లె పోగు వెంకటేశ్వర్లు, కొల్లి నాగయ్య, తుంగ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ అనంతరాజును మర్యాదపూర్వకంగా కలిసిన జి.కరుణాకర్

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని




ఖమ్మం జిల్లా చింతకాని మండలం పరిధిలోని స్థానిక నరసింహ పురం గ్రామానికి చెందిన నేటి గదర్ న్యూస్ రిపోర్టర్ గొర్రెముచ్చు కరుణాకర్ నేటి గదర్ న్యూస్ రిపోర్టర్ గా ఎంపికైన సందర్భంగా మంగళ వారం చింతకాని మండలంలో మండల రెవెన్యూ ఆఫీసర్ కే. అనంత రాజు ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేటి గదర్ న్యూస్ రిపోర్టంగా నూతనంగా బాధ్యతలు చేపట్టినటు వంటి గొర్రె ముచ్చు కరుణాకర్ తాసి ల్దార్ కే. అనంత రాజు కరుణాకర్ కు సాలువతో సత్కరించి అభినందనలు తెలియ జేశారు. వారు మాట్లాడుతు. సమాజం పట్ల ప్రజా సమస్యలపై అంకిత భావంతో సమాజ శ్రేయస్సై బాధ్యతా యుతంగా మెలగాలని ప్రతీ గ్రామాలలో, మండలాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు సేకరించి పత్రిక రంగమంలో ముందుడి చురకైనా పాత్రను పోసించి నేటి గదర్ న్యూస్ రిపోర్టర్ గా మంచి గుర్తింపు తీసుకురావాని వారు తెలియ జేసారు. బహుకరించారు. ఈ కార్య కమంలో రెడ్ స్టార్ బ్లడ్ డోనర్స్ సోషల్ మీడియా కన్వీనర్, వే టు న్యూస్ రిపోర్టర్ వంగూరి రణధీర్, ఖమ్మం జిల్లా మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ మడిపల్లి భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

### డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

### భావితరాలకు మంచి భవిష్యత్ అందిద్దాం

### రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-




గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై, భావి తరాలకు మంచి భవిష్యత్తును అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నిర్మూలన వారోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం జిల్లాలోని జైపూర్‌లోని సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్తు రోజుల్లో మాధకద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. విద్యార్థుల దృష్టి తమ భవిష్యత్తు, జీవిత లక్ష్యం పై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్ అలవాటు వలన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన గంజాయి రహిత ప్రాంతమే లక్ష్యంగా రామగుండం కమీషనరేట్ పోలీస్ శాఖ కృషి చేస్తోందని, అందులో బాగంగా విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మత్తుకు బానిస అవడానికి అనేక కారణాలు ఉంటాయని, పరిసరాల ప్రభావం, చెడు స్నేహితులు, సన్నిహితుల వలన చెడు మార్గాల వైపు వెళ్ళవద్దు అన్నారు. గంజాయి, డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించి, అలాంటి చెడు అలవాట్లకు ఆకర్షితులవ్వద్దని విజ్ఞప్తి చేశారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత,విద్యార్థులు అంతా యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి, యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా సహకరించాలన్నారు. నేడు తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, బంధువులకు తెలియజేసి డ్రగ్స్ నివారణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబధిత సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఇవ్వాలని కోరారు. యువతను లక్ష్యంగా చేసు కొని గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మిన, సరఫరా చేసిన, సేవించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులతో కలిసి మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకంపై పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు,స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లా రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్, నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, భీమారం ఎస్ఐ శ్వేతా, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, సిసి హరీష్, కస్తూర్బా ప్రిన్సిపాల్ ఫణి బాల, సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కోలా నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల కోటపల్లి ప్రిన్సిపాల్ బి రమేష్ బాబు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు, నార్కోటిక్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు

## ప్రభుత్వ విప్పు డోర్నకల్ ఎమ్మెల్యే ..రామ్ చందర్ నాయక్

టైమ్స్ ఆఫ్ వార్త సూర్యాపేట జిల్లా ప్రతినిధి(పోతరాజు వెంకన్న)



తుంగతుర్తి మండలంలో మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి నివాసంలో డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు పత్రిక సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా ప్రభుత్వంగా రైతు రాజ్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలకు నిధులను పంపిణీ చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటూ ఆరు పథకాలను అమలు చేస్తూ మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత సౌకర్యం ఉచిత విద్యుత్తు మహిళలకు మహిళా సంఘాల ద్వారా అధిక నిధులను ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అదేవిధంగా మన తెలంగాణ మంత్రులు పలు నియోజకవర్గాలలో అభివృద్ధి కార్యక్రమాలకు అధిక నిధులను మన ఎమ్మెల్యేల ద్వారా ఇవ్వడం బడుగు బలహీన వర్గాలకు ఎక్కువ నిధులను పంపిణీ చేయడం విద్య వైద్య రంగాలలో అధిక ప్రాధాన్యత ఇవ్వడం మన తెలంగాణ రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా పేదవారికి అండదండలుగా ఉంటూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్తూ ఈరోజు ఈ నియోజకవర్గానికి అధిక నిధులను తెచ్చిన ఘనత తుంగతుర్తి శాసనసభ్యులకు దక్కింది అన్నారు. అదేవిధంగా 15 నెలలలోనే 1500 కోట్ల రూపాయల నిధులను ఈ నియోజకవర్గానికి ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా రైతులకు రైతుబంధును తొమ్మిది రోజులలోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను విడుదల చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో మంత్రివర్యులు వారి జిల్లాలలో చేపడుతున్నటువంటి కోట్ల రూపాయల నిధులను ప్రజలకు అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, గుడిపాడు నరసయ్య,మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఎన్ఐసిఐ యువజన నాయకులు కొండ రాజు,అజయ్, పులి సత్తమ్మ,మాచర్ల అనిల్,పెండెం రామ్మూర్తి, కలకొట్ల మల్లేష్,మంగళపెల్లి నాగరాజు, అక్కినేపెల్లి రాములు, పలు గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అర్హులకు మాత్రమే ఇవ్వాలి

### మహబూబాబాద్ యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాంకుడోతు శ్యాం కుమార్.

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి టైమ్స్ ఆఫ్ వార్త



ఇందిరమ్మ ఇండ్లను పేదలకే అర్హులకే అందించాలని మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ శ్యామ్ కుమార్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామంలో కొన్ని ఇండ్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ... బంచరాయితండలో ఇందిరమ్మ ఇండ్లను పేదలకు విడోస్ లకు ఇవ్వకుండా కార్యదర్శి యాకూబ్ పాషా మరియు ఇంకొందరి కొందరి ఇష్టారాజ్యంగా ఎవరికి పడితే వాళ్లకు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఏ ఈ, ఎంపీడీవో, హౌసింగ్ డి ఈ, సర్వే నిర్వహించి అర్హులు అయిన పేదలుకు విడోస్ లకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని కోరారు. పేదలకు వీడియోస్లకు ఇండ్లను ఇవ్వకుండా మూడు, నాలుగు, ఐదు ఎకరాలు ఉన్న వారికి ఇండ్లను ఇస్తున్నారు. అయితే పేదలు ఇందిరమ్మ ఇండ్లకు అర్హులు కారు కానీ మూడు నుండి ఐదు ఎకరాల దాకా ఉన్నవారు ఇందిరమ్మ ఇల్లులకు ఎలా అర్హులు అవుతారని వారు ప్రశ్నించారు. తక్షణమే కలెక్టర్ స్పందించి బంచరాయితండ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మరోసారి సర్వేను నిర్వహించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. వీడోస్ కు ఇవ్వకుండా పేదలకు ఇవ్వకుండా ఇందిరమ్మ ఇండ్లను ఎవరికి పడితే వాళ్లకు ఎలా ఇస్తారు అని ప్రశ్నించారు తక్షణమే ఇందిరమ్మ ఇండ్లపై విచారణ జరిపించి అర్హులు అయిన పేదలకు విడోస్ లకు ఇండ్లను మంజూరు చేసే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

# పట్టణ మనుగడకు భంగం వాటిల్లకుండా చూడాలి

### నూతన భూగర్భ గనులు ప్రారంభించాలి

### టిడిపి ఆధ్వర్యంలో సింగరేణి సిఎండికి పోస్ట్ కార్డులు

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పట్టణ మనుగడకు భంగం వాటిల్లకుండా పట్టణ మనుగడ కొరకు శ్రావణ్ పల్లి ప్రాంతంలో రెండు భూగర్భ గనులను వెంటనే ప్రారంభించాలని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణ పరిధిలో నూతన బొగ్గు గనులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో రాష్ట్ర బొగ్గు గనుల డైరెక్టర్, సింగరేణి సిఎండి ఎన్ బలరాం లకు పోస్ట్ కార్డులు పోస్ట్ చేయడం జరిగింది అని తెలిపారు. గతంలో 8 బొగ్గు గనులతో నడిచే సమయంలో 6వేల మంది సింగరేణి కార్మికులు ఈ ప్రాంతంలో పనిచేస్తే, ప్రతి కార్మికునిపై చేతి వృత్తులు, దుకాణదారులు, ప్రైవేట్ పాఠశాలలు, కులవృత్తులు చేసుకునే వారందరూ సింగరేణి ఉద్యోగులపై ఆధారపడి, కార్మికుల పిల్లలతో పాటు వారి పిల్లలను సైతం చదివిపించుకుంటూ, గౌరవంగా జీవించేవారని తెలిపారు. కానీ ఇక్కడ సింగరేణి యాజమాన్యం భూగర్భ గనులపై దృష్టి పెట్టకపోవడంతో కేవలం కేకే 5, కాసీపేట 1, కాసీపేట 2 బొగ్గు గనులు మాత్రమే మనగడలో ఉండడంతో ఇక్కడ వివిధ చేతి వృత్తులు వారు, వ్యాపారస్తులు ప్రైవేట్ పాఠశాలలు, భవన నిర్మాణ కార్మికులు, వివిధ కులవృత్తుల వారు ఇక్కడ పనులు దొరకకపోవడంతో హైదరాబాద్ కు వలస వెళ్లే పరిస్థితి ఉత్పన్నమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్ట్ కార్డు ఉద్యమంలో పట్టణ పరిసర ప్రాంత ప్రజలు, ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో తమ వంతు పాత్ర పోషించి, ఉద్యమం చేసి, మన ప్రాంతంలో రెండు బొగ్గు గనులను ఏర్పాటు చేపించుకునే విధంగా సింగరేణి పై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షురాలు ఆర్ జయ సుకన్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కారం రాజు, మహిళా ప్రధాన కార్యదర్శి జూపాక సంధ్య, నాయకులు సామ నాగేష్ రెడ్డి, సత్యనారాయణ, రంగనాథ్, చాట్లపల్లి రాజేష్, జ్యోతి, సామ కవిత, ముల్కల భాగ్యలక్ష్మి, భారతి, అరుణ, సన, రమాదేవి, మమత దేవి, నరసమ్మ, సమ్మక్క, రమాదేవి లు పాల్గొన్నారు.



TIMES OF VARTHA (25-06-2025)1_times of varha main (13-2).qxd 6/25/2025 6:13 AM Page 3

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
బుధవారం, 25-06-2025


# రైతు భరోసా విజయోత్సవ సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని




చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదిక నందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతు విజయోత్సవ సంబరాలు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొనడం జరిగింది. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద నిధులు రైతుల ఖాతాలో విడుదల చేసిన శుభ సందర్భాన్ని పురస్క రించుకుని మండలంలోని రైతులు మరియు పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటానికి పాలా భిషేకం చేసి, స్వీట్ పంచి టపాసులు కాల్చారు. అనంతరం రైతులందరు ప్రజా ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేవలం18 నెలలో రైతు రుణమాఫీ, రైతు భరోసా,రైతు బోనస్లు అందించిన ఏకైక ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షులు మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్లు కొప్పుల గోవిందరావు, తోటకూరి ప్రగతి,సట్టు వెంకటేశ్వర్లు, జిల్లా సీనియర్ కాంగ్రెస్ మడుపల్లి భాస్కర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కన్నెబోయిన గోపి, మండల కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున, ఓర్సు వీరభద్రం, పాతర్లపాడు మాజీ ఎంపిటిసి బొర్రా ప్రసాద్ రావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మనం చిన్నప్ప, మండల ఎస్సీ సెల్ కార్యదర్శి తడికమళ్ళ రమేష్,మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్ కే పాషా, సీనియర్ మైనార్టీ నాయకులు షేక్ సుభాని,గాంధీనగర్ గ్రామ శాఖ అధ్యక్షులు వంగూరి రమేష్, చింతకాని గ్రామ శాఖ అధ్యక్షులు ఎస్కే అబ్దుల్ మసీద్, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు, తోటకూరి హరీష్, సీతంపేట మాజీ సర్పంచ్ నారపోగు కొండల్ రావు, నూతల పాటి వెంకటేశ్వర్లు, అనంతసాగర్ గ్రామ ఉపాధ్యక్షులు ఇటుకరాళ్ల లెనిన్, షేక్ షాజహాన్, బండి శ్రీనివాస రావు, మరియు వివిధ హోదా లలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి కిరీటానికి చింతకాని మండల తహసీల్దార్ కూరపాటి అనంతరాజ్ వితరణ



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

చింతకాని మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహానికి కిరీటం కోసం చింతకాని మండల తహసిల్దార్ అనంతరాజు 40 వేల రూపాయలను దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగాకమిటీ సభ్యులు అనంతరాజు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి, వారు ఇంకా ఉన్నత స్థానానికి వెళ్ళాలని ఆంజనేయస్వామిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడుపల్లి భాస్కర్ గౌడ్, దేవాలయ డెవలప్మెంట్ నెంబర్ మల్లెల వెంకటేశ్వర్లు, బసవయ్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ బిబాన్సువాడ ప్రధాన రహదారిపై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన..

### అధిక రేట్లకు ఇసుక అమ్ముతున్నారని ఆరోపణ

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుకను అందిస్తామని ఒక దిక్కు ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, మరోపక్క ట్రాక్టర్ల యజమానులు అధిక రేట్లకు ఇసుక అమ్ముతున్నారని ఆరోపిస్తూ మంగళవారం బీర్కూర్, బాన్సువాడ రహదారి కొల్లూరులో రోడ్డుపై బైఠాయించి ఆందోళన. ట్రాక్టర్ ఇసుక 1600 కి అందజేయాలని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల డిమాండ్ . అధిక ధరల కు ఇసుక అమ్మకు అమ్ముతున్నారంటూ లబ్ధిదారుల మండిపాటు,బీర్కూర్,బిబాన్సువాడ రహదారిపై నిలిచిపోయిన రాకపోకలు. లబ్ధిదారుతో మాట్లాడుతున్న అధికారులు ప్రజాప్రతినిధులు. కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, ప్రజలు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని యువకుడి బలవన్మరణం...



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనబాన్సువాడనియోజకవర్గం వర్ని మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వర్ణి ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జాగోర గ్రామానికి చెందిన కమ్మరి సతీష్ (40) ఫోటోగ్రాఫర్ గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య ,ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే సతీష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు.

## ఎలక్ట్రికల్ స్కూటీలో మంటలు



టైమ్స్ ఆఫ్ వార్త -కామారెడ్డి /గాంధారి

కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి మండలం ఎర్ర పహాడ్ లో ఎలక్ట్రికల్ స్కూటీ లో మంటలు చెలరేగాయి. గ్రామానికి చెందిన మైస గౌడ్ తన ఎలక్ట్రికల్ స్కూటీని ఇంటి ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ స్కూటీ లో నుండి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు అర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే పూర్తిగా కాలిపోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. బ్యాటరీ లో షేట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని ఆయన తెలిపారు. బ్యాటరీ లోని అంతర్గత భాగాలు దెబ్బ తినడం వల్ల లేదా వైరింగ్ సమస్యల వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి, అది అదిక వేడిని పుట్టించి మంటలకు దారితీస్తుంది. ఎలక్ట్రికల్ స్కూటీ వాడే వినియోగదారులు కంపెనీ ఇచ్చే జాగ్రత్తలను పాటించి ఎలక్ట్రికల్ స్కూటర్ల వాడకాన్ని సురక్షితం చేసుకోవచ్చు.

## ముత్యాలమ్మ తల్లికి జలాభిషేకం

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

నాగుల వంచ లో ముత్యాలమ్మ తల్లి కి జలాభిషేకం చేస్తున్న దృశ్యం. గ్రామాల్లో గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ కార్య క్రమానికి మా ఇల్లు పెద్ద సంఖ్యలో హాజర వుతున్నారు.



## ఇరాన్ పై అమెరికన్ సామ్రాజ్యవాద దాడిని ఖండించండి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ

టైమ్స్ ఆఫ్ వార్త - కామారెడ్డి/ సదాశివనగర్





ఇరాన్ దేశంపై అమెరికన్ సామ్రాజ్యవాదులు చేసిన యుధవదాడిని ప్రపంచ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఎదురుగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో అమెరికన్ సామ్రాజ్యవాద దేశ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచ మార్కెటు ను జయించటం కోసం అమెరికన్ సామ్రాజ్యవాదులు తమ తొత్తు ప్రభుత్వాలను ఆసరా చేసుకుని మిగతా ప్రపంచ దేశాలపై దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఆసియా ఖండంలో పట్టు సాధించడం కోసం ఇజ్రాయిల్, పాకిస్తాన్, దక్షిణ కొరియాలను స్థావరాలుగా ఏర్పరచుకొని తనను ఎదిరించిన దేశాలపై యుద్ధాలు చేస్తుంది అని అన్నారు. ఒక కుక్కను చంపాలంటే దాని పిచ్చుకగా చేసి ప్రచారం చేయాలనే సామెత ఈ సామెత ఆధారంగా అమెరికా ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ వద్ద అను బాంబులు ఉన్నాయంటూ గత కొంతకాలంగా గోబెల్ ప్రచారం చేస్తూ ఇప్పుడు దాడులకు దిగారని ఆరోపించారు. అమెరికాను సామ్రాజ్యవాదులకు ఇది వెన్నుతో పెట్టిన విద్య అని గతంలో సద్దాం హుస్సేన్ తదితరులు అందర్నీ కూడా ఈ విధంగా ప్రచారం చేసి సంపాలని కుట్రలు చేసింది అనుభవములు ఉంటే యుద్ధాలు చేయాలనుకుంటే మరి ప్రస్తుతం పాకిస్తాన్ దగ్గర 100లకొద్దీ అనుభవములు ఉన్నాయని అమెరికానే చెప్పింది కదా మరి వారి మీద ఎందుకు యుద్ధం చేయటం లేదని ప్రశ్నించారు. అమెరికా అగ్రరాజ్యమైన దేశం అమెరికా చిన్న చిన్న దేశాలను విచ్చనకరులుగా చేసి తన చెప్పు చేతుల్లో రాని దేశాలపై బాంబులతో యుద్ధం చేసి బెదిరింపులకు దిగుతా ఉంది. చిన్న దేశాలకు ఈ విధంగా బెదిరిస్తుంది మరి ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏది అనుకుంటాడో ఆ దేశం మీద దండయాత్ర చేయాలంటే ఆ దేశాన్ని నాశనం చేసేదాకా తన పంతం ఎక్కించుకుంటాడు ఈ రకమైన దాడులను ప్రజాస్వామికవాదులు ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ఏ.ప్రకాష్, జి. పరమేష్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు జి.సురేష్, టి యు సి ఐ జిల్లా కార్యదర్శి అనీష్ నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు

### బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ భీమా చెక్కు అందజేత

టైమ్స్ ఆఫ్ వార్తు బాన్సువాడ:




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ శాసనసభ్యులు అసెంబ్లీలో సీనియర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం నాడు శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ భీమా చెక్కును బాధితు రాలికి అందజేశారు . మహమ్మదనగర్ మండల తుంకిపల్లి గ్రామానికి చెందిన రౌతు సాయిలు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో 65410/ రూపాయల పాలసీ తీసుకోవడం జరిగింది. తీసుకున్న రెండునెలల్లో ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. ఇందుకు గాను నామినీ అయిన రౌతు నిర్మల కి మన కంపెనీ ద్వారా వచ్చిన మొత్తం భీమా డబ్బులు 36,16,791 రూపాయలను ఇవ్వడం జరిగింది. ఇందులో మొదటి విడతగా 20,05,791రూపాయలు అందచేయడం జరిగింది.నామిని అయిన రౌతు నిర్మల కి నెలకి 9,000లి/ రూపాయలు 14 సం,,ల 11 నెలల పాటుగా పెన్షన్రూపంలో 16,11,000 ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమం లో సంస్థ డీ.జీ.ఎం.ఏ.ఏ.సురేష్ ,ఆర్.ఎం. టి.శ్రీనివాస్ , బ్రాంచ్ మేనేజర్ ఎస్.నవీన్ కుమార్, ఎంప్లాయిస్ నాయిని శంకర్, శ్రీకాంత్, నవీన్, శ్రీనివాస్, అనిల్, డి వో ..ఎస్. ఓ. మిత్రులు అన్నం హన్మండ్లు , మండల శ్రీనివాస్ , స్వాగత్, పండరి ,సుంకరి వెంకట్ తోపాటు శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఏజెంట్ మిత్రులు, కార్యాలయం సిబ్బంది, తదితరులు, పాల్గొనడం జరిగింది.

## బాన్సువాడ శ్రీ కోట దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ మహోత్సవం



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని కోటగల్లి ప్రాంతంలో కొలువుదీరిన శ్రీ కోట దుర్గమ్మ ఆలయప్రాంగణంలోమంగళవారం నాడు అమ్మవారి భక్తుడు బాసం అనురాధ సంతోష్ దంపతుల ఆర్థిక సౌజన్యంతో అన్న ప్రసాద వితరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అమ్మవారి మూలవిరట్టుకు జలాభిషేకం, పంచామృతాభిషేకం చేపట్టి, అందంగా అలంకరించి ముస్తాబు చేశారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన, లలిత, విష్ణు, సహస్రనామ పారాయణం చేపట్టారు. అన్న ప్రసాద వితరణ దాతకు ఆలయ కమిటీ ప్రతినిధులు పూలమాల, జ్ఞాపిక, శాలువాతో సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు, తెలియజేశారు. వారిపై వారి కుటుంబ సభ్యులపై విశ్వపాలని జగన్మాత ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనసారా ఆకాంక్షించారు. సాయంత్రం పల్లకి సేవ ,రాత్రికి భజన చేపట్టి, భక్తులకు అల్పాహారం అందజేశారు .ఈ సందర్భంగా సైనిక్ స్కూల్ పాఠశాలలో సీటు సంపాదించిన పత్తి అను శ్రీనివాస్కు పూలమాల, జ్ఞాపిక, శాలువాతో సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోట దుర్గమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పత్తి శ్రీకాంత్, అధ్యక్షుడు ఉప్పరి లింగం తో పాటుప్రతినిధులు,కాలనీవాసులుఅమ్మవారి భక్తులు, హిందూ బంధువులు, తదితరులు, పాల్గొన్నారు.

## చదువు ఆగం చేసుకోవద్దని చెప్పినందుకు.. ప్రియుడితో కలిసి తల్లిని హతమార్చిన బాలిక



కుత్బుల్లాపూర్ : చిన్న వయసులో ప్రేమంటూ చదువును ఆగం చేసుకోవద్దని కన్నతల్లి కూతురికి నచ్చజెప్పింది.. మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని చెప్పింది.. కానీ, ఆ బాలికకు తల్లి మాటలు కంటగింపుగా అనిపించాయి. దీంతో కక్ష పెంచుకుని ప్రియుడు, అతని తమ్ముడితో కలిసి తల్లిని దారుణంగా చంపేశారు. మృతురాలు తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఫోక్ సింగర్ అని తెలిసింది. ఈ దారుణ ఘటనపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పరిధిలోని ఇనుగుర్తి గ్రామానికి చెందిన అంజలి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి జీడిమెట్లలో నివాసం ఉంటోంది. పెద్ద కుమార్తె(16) పదో తరగతి చదువుతోంది. బాలికకు నల్లగొండ జిల్లాకు చెందిన పగిల్ల శివతో 8 నెలల కిందట ఇన్స్టాగ్రామ్లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమకు దారి తీసింది. విషయం అంజలికి తెలియడంతో చదువుకోవాల్సిన వయసులో ప్రేమ ఏంటని ఇద్దరినీ మందలించింది. ఈ క్రమంలో ఈనెల 19న ఇంట్లో నుంచి బాలిక ప్రియుడితో వెళ్లిపోయింది. దాంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం శివ బాలికను పోలీసులకు అప్పగించాడు. పోలీసులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో తమ ప్రేమకు అడ్డంగా ఉన్న తల్లిని ఎలాగైనా అంతమొందించాలని కూతురు, ఆమె ప్రియుడు కలిసి పథకం వేశారు. ఈ నెల 23న(సోమవారం సాయంత్రం) బాలిక ప్రియుడు అతని తమ్ముడు యశ్వంత్తో కలిసి ఆమె ఇంటికి వచ్చారు. అంజలి పూజ చేస్తుండగా వెనుక నుంచి శివ ఆమె మెడకు చున్ని బిగించడంతో తీవ్ర పెనుగులాట జరిగింది. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయిందనుకుని శివ, అతని తమ్ముడు వెళ్లిపోయారు. అదే సమయంలో అంజలి చిన్న కుమార్తె ట్యూషన్ నుంచి ఇంటికొచ్చింది. అమ్మ పూజ చేస్తూ కింద పడిపోయిందని, తాను చూసుకుంటానని ఆ బాలికకు మాయమాటలు చెప్పి పెద్ద కుమార్తె బయటకు పంపించింది. ఆ తర్వాత మళ్లీ శివను పిలిపించి అంజలి తలపై సుత్తితో కొట్టి, గొంతు నులిమి హత్య చేశారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
బుధవారం,
25-06-2025


# చెప్పింది చెప్పినట్లుగా రైతు భరోసా నిధులు విడుదల

**కొత్తగూడెం రైతు వేదిక లో ఆనందోత్సవాలు**

**తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెలు వెల్లడి**

టైమ్స్ ఆఫ్ వార్త సూర్యాపేట జిల్లా ప్రతినిధి

(పోతరాజువెంకన్న)



తుంగతుర్తి మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో రైతు సమన్వయ కమిటీ హాల్ లో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్. ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, రైతులతో టెలికాన్ఫరెన్సో టీవీలో ఒకేసారి తెలంగాణ రాష్ట్రంలో 9000 కోట్ల డబ్బును రైతులందరికీ రైతు భరోసా 15 ఎకరాల లోపు ఉన్న రైతులందరికీ వానాకాలం పంటలు దుక్కులు విత్తనాలు వేసే ముందు రైతులకు అందివ్వడం ఏకైక లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వం గా రైతు రాజ్యాంగ మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆర్థిక శాఖ వెసులుబాటుతో వారం రోజుల లోపు రైతుబంధు రైతులందరికీ తెలంగాణ రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతి రైతుకు ఎకరానికి 6000 చొప్పున అందివ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా రైతులకు ఆయిల్ ఫామ్ సబ్సిడీలపై తోటలు పెట్టడం వారిని అభివృద్ధి పదంలో నడిపిస్తూ ఎన్నో ఒడిదుడుకులు వచ్చినప్పటికీ అధిక నిధులను రైతులకే వారి ఖాతాలోనికి వచ్చే విధంగా ఐకెపి సెంటర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారం రోజుల లోపే రైతులకు అందివ్వడం జరిగిందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వంగా భావిస్తూ రైతులకు మేలు రకమైన విత్తనాలు ఎలాంటి కల్తీ లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టంగా అధికారులతో సమన్వయంగా నడిపిస్తూ రైతులకు విత్తనాలు షాపులలోనే లైసెన్సు ఉన్న వారి వద్దనే కొనుగోలు చేయాలని వారికి అవగాహన సదస్సుల ద్వారా అగ్రికల్చర్ అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు సదస్సులను ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు మండల సామెల్ 15 నెలల లోపే 1500 కోట్ల రూపాయలను పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను తేవడం జరిగిందన్నారు. ఇదంతా మీరు చూస్తున్నారు మీ ముందటమే జరుగుతున్నది అని శాసనసభ్యులు మందుల శామ్యూల్ రైతులకు వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఈ నియోజకవర్గం వెనుకబాటు జరిగిందని ఆరోజు ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యేలు మంత్రులు దోచుకునుడు దాచుకునుడు తప్ప ఏమీ లేదన్నారు, అదేవిధంగా ఈ నియోజకవర్గంలో గత పాలకులు మైనింగ్ గుట్టలు ఉసికే మట్టి మాఫియాలు జరిగి ఎన్నో ప్రభుత్వ భూములను దోచుకుని దాచుకున్నారని ఈరోజు జైలుకు పోవడం ఖాయం అన్నారు. వారిపై కేసులు ఉన్నప్పటికీ ఇంకా మాయమాటలతో ప్రతిపక్షంలో ఉన్నామని మేము బాగు చేసినమని అని చెప్పుకోవడం వారి అవివేకానికే వదిలేస్తు న్నామన్నారు, ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రజలు గత పాలకులు చేసిన మోసాలకు మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీని నామరూపాలు లేకుండా ఓడగొట్టిన ప్రజలకు నాకు అత్యధిక మెజార్టీ ఇచ్చిన నా నియోజకవర్గ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో దయానంద్ ఏడిఏ రామారావు. ఏవో బాలకృష్ణ పలువురు అగ్రికల్చర్ అధికారులు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అనురాధ కిషన్ రావు డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు. మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఎన్ ఎస్ బి ఐ జిల్లా నాయకులు కొండరాజు, మాచర్ల అనిల్,మల్లేష్, నాగరాజు,పలువురు కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లచ్చగూడెం రైతు వేదికలో ఎంపీడీవో



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

లచ్చగూడెం రైతు వేదిక లో జరుగుతున్న రైతు భరోసా కార్యక్రమం పై రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం లో పాల్గొన్న ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు ,ఇతర మండల అధికారులు, రైతులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన గోపి,కొప్పుల గోవిందరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు తదితరులు.

## రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్

**ఎం.పీ. ఓ లక్ష్మి**



టైమ్స్ ఆఫ్ వార్త -గాంధారి

గాంధారి మండలములోని పొతంకల్ కలాన్ ఉన్న రైతు వేదికలో మంగళవారం రోజు రైతు భరోసా ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా పాల్గొనడం జరిగిందని మండల ఎంపీఓ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, రైతు భరోసా, రైతు బీమా ఉత్సవాలను పోతంగల్ కలాన్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ కలాన్ ఏ ఈ ఓ షేక్ సోయాద్, పోతంగల్ పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, రైతులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అవసరాలకు సరిపడా అందుబాటులో ఎరువులు, విత్తనాలు

**కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి**

**ఎరువులు, విత్తన పంపిణీ కేంద్రం ఆకస్మిక తనిఖీ**



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. డిచ్పల్లి మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన విక్రయ కేంద్రమైన గ్రోమోర్ సెంటర్ ను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ బుక్, బిల్ బుక్ లను, విత్తన బస్తాలపై లాట్ నంబర్, ఎం.ఆర్.పీ ధర, బ్యాచ్ నెంబర్, గడువు తేదీ తదితర వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తన అమ్మకాలకు తగిన అనుమతులు పొందిన పత్రాలను పరిశీలించి, కేంద్రం నిర్వాహకులకు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా ఎంత పరిమాణంలో ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి, ఎన్ని రోజులకు ఒకసారి స్టాక్ వస్తోంది అని కలెక్టర్ ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్ లో, ఈ-పాస్ నమోదు వివరాలలో తేడా ఉండకూడదని అన్నారు. కాగా, జిల్లాలో జూన్, జూలై నెలలకు సరిపడా ఎరువులు, విత్తనాల నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా కొరత నెలకొనకుండా రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. అన్ని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువుల కారణంగా ఎక్కడ కూడా ఏ ఒక్క రైతు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు. నకిలీ ఎరువులు, విత్తన విక్రయాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, రైతులను నష్టపరిచే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, తహసీల్దార్ సతీష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి సుధా మాధురి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**కోటగిరి ఎస్సై సునీల్**

టైమ్స్ ఆఫ్ వార్తు బాన్సువాడ:

విద్యార్థు లు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోటగిరి ఎస్సై సునీల్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మత్తు పదార్థాలు, సైబర్ క్రైమ్, అంశాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపవద్దని సూచించారు ఈ.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ కాలేక్, అంగన్వాడి సూపర్వైజర్ కొమురవ్వ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఎంపీడీవో రాజేశ్వర్



టైమ్స్ ఆఫ్ వార్త -గాంధారి

గాంధారి మండల కేంద్రంలో ఉన్న రైతు వేదికలో మంగళవారం రోజు రైతు భరోసా ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా పాల్గొనడం జరిగిందని మండల ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం, రైతు భరోసా, రైతు బీమా ఉత్సవాలను గాంధారి మండల రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ నిఖిత, ఏపీఎం గంగరాజు, ఏపీఓ మధు,గాంధారి పంచాయతీ సెక్రెటరీ నాగరాజు,రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల ప్రారంభోత్సవం

**జిల్లా విద్యాశాఖ అధికారి రాజు**



టైమ్స్ ఆఫ్ వార్త-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని పల్లెల మడుగు తాండాలో ప్రాథమిక పాఠశాలను విద్యాశాఖ అధికారి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాల క్రితం మూతబడిన పాఠశాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు 19 మంది విద్యార్థులతో ఈ పాఠశాలను ప్రారంభించామన్నారు. ఈ పాఠశాల పునర్ ప్రారంభానికి కృషిచేసిన ప్రత్యేక ఉపాధ్యాయుడు పెంటయ్యను పాఠశాలను అభివృద్ధి పరచాలని తెలిపారు. మారుమూల ప్రాంతమైన గిరిజన తండాలను విద్యాభివృద్ధితో అభివృద్ధి పరచాలని సంకల్పంతో ప్రత్యేక కార్యచరణతో పాఠశాలను ప్రారంభించామన్నారు. పాఠశాల అభివృద్ధికి జిల్లా విద్యాశాఖ అధికారి 2000 రూపాయలను అందజేశారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రంజిత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు డీఈఓ చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ప్రారంభంలో భాగంగా భ డి ఇ ఓ రాజు, ఏ ఎం ఓ వేణుగోపాల్, ఎమ్ ఇ ఓ శ్రీహరి మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి ప్రారంభించారు. పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్, రమేష్, సి ఆర్ పి సాయిలు, మాజీ ఎంపిటిసి శంకర్ నాయక్, వార్డు మెంబర్ గణేష్ అంగన్వాడీ టీచర్ సునీత గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యురాలు విజయశాంతి పుట్టినరోజు వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్**

**శిరీషా సత్తూర్..**



టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యురాలు విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీషా సత్తూర్ విజయశాంతి ని వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.





## ఉచిత వైద్య శిబిరం

టైమ్స్ ఆఫ్ వార్త -బిక్కనూర్

జిల్లాలోని బిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామంలో మెడిసిటీ మేడ్చల్ వైద్యులుమంగళవారం సొసైటీ ప్రాంగణంలో ఉచిత వైద్య చికిత్సలు నిర్వహించారు. అనంతరం వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాలగోని రాజా గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ టెంట్ హౌస్ స్వామి, వైద్యులకు శాలువాతో సత్కారం చేశారు.మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోడూరు సాయ గౌడ్, సొసైటీ డైరెక్టర్లు ఇటిక్యాల బాగా రెడ్డి, సల్మెడ బాబు, ఈశ్వర్ రెడ్డి, మంగలి బాబు, బండల్ల భూషణం,ఆర్ఎంపీ డాక్టర్ కొండల్ రావు, మెడిసిటీ క్యాంప్ డాక్టర్స్ డాక్టర్ కృష్ణ, సీవిత, హరీష్, శ్రీజ, ఉత్త కరిష్య, మార్కెటింగ్ సంజయ్ రాకేష్, బాలకృష్ణ, న్యూరోసిగ్, వ్యాదుల్, ఫార్మసీ దీక్ష, దాదాపు 200 హెల్త్ చెకప్ చేశారు. అందులో 60 మందిని హాస్పటల్ కు తీసుకెళ్తామని వైద్యులు తెలిపారు. గ్రామస్తులు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం గర్వకారణం

**నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలను చేపడుతు ప్రపంచంలో అతిపెద్ద సంస్థగా ఏబీవీపీ ఎదగడం గర్వకారణం అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. ఆర్మూర్ లోని పెర్కిట్ లో గల క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శిక్షణ తరగతుల్లో ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ పాల్గొన్నారు. దేశం కోసం, ధర్మం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలర్పించిన విద్యార్థి పరిషత్ అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు విద్యార్థుల సమస్యల పట్ల నిత్యం పోరాటాలు చేస్తూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలను చేపడుతు ప్రపంచంలో అతిపెద్ద సంస్థగా ఎదగడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా పాల్గొన్నారు.

# యాదవ కులస్తులపై కాంగ్రెస్ పార్టీ వివక్ష

**రాష్ట్ర యాదవ సంఘం బీసీ జన సభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్**

**30న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా, పోస్టర్ల ఆవిష్కరణ**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ





గతంలో ఎన్నడు లేని విధంగా కాంగ్రెస్ పార్టీ యాదవ కులస్తులను అణిచివేస్తుందని, యాదవులపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షత చూపుతుందని రాష్ట్ర యాదవ సంఘం బిసి జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ విమర్శించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో యాదవ సంఘం ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదవులను, మున్నూరు కాపులను ఇతర కులాలను అణిచివేస్తుందని అన్నారు. బీసీలను అణగదొక్కడమే సామాజిక న్యాయమా అంటూ ఆయన ప్రశ్నించారు. మంత్రివర్గంలో, కార్పొరేషన్, పార్టీ పదవులలో యాదవులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పడానికి హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 30న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా మహా ధర్నా చేపడుతున్నట్లు ప్రచారం యాదవ్ వెల్లడించారు. యాదవ కులస్తుల ఐక్యమత్యాన్ని చాటే విధంగా చేపడుతున్న ధర్నాకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి యాదవ సోదరులు తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు. అత్యధిక జనాభా ఉన్న యాదవులను రేవంత్ రెడ్డి కించపరుస్తూ మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం, కనీసం ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించకపోవడం యాదవులను అవమానించడమేనన్నారు. యాదవ లోకాన్ని అవమానపరిచే విధంగా వివరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం 30న హైదరాబాద్ లో జరిగే మహా ధర్నాకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, జిల్లా కన్వీనర్ బాపూరావు యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు రాజన్న యాదవ్, జనార్దన్ యాదవ్, లింగన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
బుధవారం,
25-06-2025
5

# జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

### ఇజ్రాయిల్, అమెరికాలు సంయుక్తంగా
### ఇరాన్ పై చేస్తున్న దాడిని ఆపాలి
### పని గంటల పెంపును నిలిపి
### రూ.26వేలు వేతనం చెల్లించాలి
### నూతన కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులు
### సూర్యం, పద్మ ఆధ్వర్యంలో పలు తీర్మానాలు




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లి ఎన్. ఆర్. భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులు కే. సూర్యం, ఎస్. ఎల్. పద్మ పలు తీర్మానాలు చేశారు. ఇజ్రాయిల్, అమెరికాలు సంయుక్తంగా ఇరాన్ పై చేస్తున్న దాడిని ఆపాలని, అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ, దురహంకారంతో బాంబర్లతో దాడి చేయడం దుర్మార్గమైనదనీ టియుసిఐ ప్రధమ మహాసభ తీవ్రంగా ఖండించిందన్నారు. దాడులను తక్షణమే ఆపాలని, యుద్ధం వల్ల కార్మికులు, ప్రజలు నష్టపోతారని, అమెరికా సామ్రాజ్య ఆధిపత్యంతో మానవహననానికి, దురాక్రమనకు పాల్పడడాన్ని మహాసభ ఖండించింది. అదేవిధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ గా మార్చడాన్ని, కార్మికుల కనీస ప్రయోజనాలు కల్పించే చట్టాలను రద్దు చేయడానికి తీవ్రంగా నిరసించింది. లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, పని గంటల పెంపును నిలిపివేయాలని మహాసభ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పి.ఎఫ్. పెన్షన్ ను 9వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన ఇతర నిర్మాణ రంగ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ క్లెయిమ్ లను వెంటనే విడుదల చేయాలని, ప్రమాదంతో, అనారోగ్యంతో మరణించే కార్మికులకు చేసే చెల్లింపులను ప్రైవేట్, టాటా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అదేవిధంగా కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్స్, యూనివర్సిటీ ల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస వేతనం 26వేలు చెల్లించాలని, పీఆర్సి నివేదిక ప్రకారం మినిమం స్కేల్ నిర్ణయించాలని, మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, పని భారాన్ని తగ్గించాలని, రెగ్యులరైజ్ చేయాలని మహాసభ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఫిక్స్, టర్మ్ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలని, వారిని పర్మినెంట్ చేయాలని, హాస్పిటల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన బకాయిలు చెల్లించాలని, వేధింపులను మానుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు సకాలంలో చెల్లించాలని, వేతన బకాయిలు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, రైస్ మిల్లులో రా రైస్ ని 100% ప్రభుత్వం కొనుగోలు చేయాలని, బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవనభృతి ఇవ్వాలని, ప్రభుత్వ కనీస వేతనాల జీవోను పెంచి తక్షణమే అమలు చేయాలని, జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలని కోరారు. ఆటో, మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 12వేలు అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథక కార్మికులకు అలవెన్స్ పదివేల రూపాయలు చెల్లిస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దానిని వెంటనే అమలు చేయాలని, ఐటీ రంగ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని, 10 నుంచి 12 గంటలు పని చేయించే విధానాన్ని మానుకోవాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం, ఆదివాసీల హననానికి పాల్పడుతున్న స్థితిని తక్షణమే నిలిపివేయాలని, అంబానీ ఆదానీలకు ఖనిజ సంపదలను అప్పగించే చర్యలను మానుకోవాలని, మావోయిస్టు పార్టీని అంతం చేస్తానని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడానికి తీవ్రంగా తప్పు పట్టింది. ఈ సందర్భంగా మహాసభ భవిష్యత్ కార్యక్రమాన్ని చర్చించి ప్రకటించింది. జూలై 9 న కార్మిక సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సంస్థ నుంచి అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చింది. జూలై 31వ తేదీన తెలంగాణ రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పైన, కనీస వేతనం 26వేలు చెల్లించాలని, కనీస పెన్షన్ 9వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని అమలు చేయాలని, తదితర డిమాండ్లపై జిల్లా కేంద్రాలలో ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ సమావేశం లో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. నరేందర్, సహాయ కార్యదర్శులు, ఎం. ముత్తెన్న, ఎం. వెంకన్న, జిల్లా కార్యదర్శి ఎం. సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేశ్వర్, మల్లేష్, జిల్లా నాయకులు కిరణ్, రవి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా యుద్దోన్మాదానికి వ్యతిరేకంగా వామపక్షాల నిరసన, దిష్టిబొమ్మ దగ్ధం



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోనీ ధర్నా చౌక్ వద్ద అమెరికా అధ్యక్షుని ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వామ పక్ష పార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఇరాన్ పై అమెరికా దాడులను ఖండిస్తూ అమెరికా యుధోన్మాద చర్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య, న్యూ డెమోక్రసీ నాయకులు శివకుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో అశాంతి నెలకొల్పడానికి పచ్చిమాసియా దేశాల్లో యుద్ధ వాతావరణన్ని ప్రోత్సహిస్తూ అమెరికా తన యుద్ధ సామాగ్రిని అమ్ముకుంటూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని, అందులో భాగంగానే ఇరాన్ లోని చమురు నిక్షేపాలను తన గుప్పిట్లో పెట్టుకోవడానికి ఇరాన్ అధ్యక్షుని లొంగదీసుకోవాలని, అనువాస్త్రాల వంకతో ఇరాన్ పై ప్రత్యక్షంగా దాడులు చేస్తూ మంత్రాలను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఇది పూర్తిగా ఒక దేశం అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటమే అవుతుందని, దీని ఫలితంగా పేదరికం మరింత పెరుగుతుందని ప్రపంచంలో నిత్యవసర సరుకుల ధరలు పెరగటానికి అమెరికా చర్యలు దోహదపడుతున్నాయని వారు విమర్శించారు. అనవస్త్రాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తున్న అమెరికా తన వద్ద ఉన్న 180 అను వస్త్రాల గురించి మాట్లాడటం లేదని వారు విమర్శించారు. ప్రపంచంలో శాంతి నెలకులపాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారత్, పాక్ మధ్య తానే యుద్ధాన్ని నిలుపుదల చేసినట్లు గొప్పలు చెప్పుకున్న అమెరికాకు భారత ప్రభుత్వం కూడా అదే పద్ధతుల్లో జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికా చర్యలను ప్రభుత్వం ముక్తకంఠంతో ఖండించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విగ్నేష్ నగర నాయకులు కటారి రాములు, అనిత, మాస్ లైన్ జిల్లా నాయకులు సుధాకర్, వెంకన్న, నరేందర్, గణేష్, న్యూ డెమోక్రసీ నాయకులు సాయిబాబా, మల్లికార్జున్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నియంత్రణను ప్రతిఒక్కరు కఠినంగా నియంత్రించాలి

### వచ్చే 6 నెలలలో ప్లాన్ అఫ్ యాక్షన్
### ప్రతి కేసులో నాణ్యమైన ధర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలి
### లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలి
### సైబర్ క్రైమ్ గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
### నెల వారి సమీక్ష సమావేశం లో
### నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ క్రైమ్

డ్రగ్స్ నియంత్రణను ప్రతిఒక్కరు కఠినంగా నియంత్రించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. పోలీస్ కార్యాలయంలో కమిషనరేటు పరిధిలోని నేరాల నియంత్రణ కోసం సంబంధిత నిజామాబాదు డివిజన్ ఏ.సి.పి, సి.ఐలు, ఎస్.హెచ్.ఓలు, ఎస్.ఐలతో సిపి సాయి చైతన్య సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ కార్యాలయంలో నిజామాబాదు డివిజన్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినారు. వచ్చే ఆరు నెలలలో ప్రతి ఎస్ హెచ్ ఓ లక్ష్యాలు పెట్టుకొని నేరాల నియంత్రణ కోసం ఒక ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందులో ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణ నేరాల నియంత్రణ కోసం పూర్తిగా కంట్రోల్ ఉండేవిధంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి బందోబస్తును సమర్ధవంతంగా నిర్వహించేటట్లు సిబ్బందికి సంబంధించిన వెల్ఫేర్ తదితర ఒక ప్రణాళిక ప్రకారంగా ప్లాన్ ఆఫ్ యాక్షన్ నిర్వహించాలన్నారు. అదేవిధంగా ప్రాపర్టీ అఫెన్సులలో ఉన్న ట్రెండ్ అర్థం చేసుకొని పాట్రోలింగ్ విధానంలో మార్పుల గురించి క్షుణ్ణంగా చర్చించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రతి ఎస్ హెచ్ ఓ అధికారికి వాటి మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆ చోట రోడ్డు ప్రమాదాలు జరగకుండా కావలసిన ఏర్పాట్లు చేసి రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ల వారిగా పెండింగ్ లో ఉన్న కేసులను క్షుణ్ణంగా సమీక్షించి త్వరితగతిన దర్యాప్తు ముగించడానికి తగిన సూచనలు ఇచ్చారు. అండర్ ఇన్వేస్టిగేషన్ కేసులను త్వరగా పూర్తి చేయడం, కోర్టులలో ఉన్న కేసుల త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మహిళల భద్రతకోసం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, వారికి అన్ని రకాల భద్రతల విషయంలో ఎల్లప్పుడు సహాకారాం అందించాలని తెలియజేశారు. అదేవిధంగా ఇప్పటి వరకు జరిగిన నేరాలలో త్వరితగతిన "విచారణ" పూర్తిచేసి పెండింగ్ నేరాల శాతం తగ్గించాలని సూచించారు. సైబర్ మోసగాండ్ల నుంచి ప్రజలు మోసపోకుండా ప్రతీ ఒక్కరిని అప్రమత్తం చేయాలని సూచించారు. ఇక గేమింగ్ యాప్ల పట్ల ప్రజలు మెసపోకుండా ఎప్పటికప్పుడు వారికీ అవగాహనా కార్యాక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి మొదలగు చట్టవ్యతిరేక కార్యాకలాపాలపై ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు, లాడ్జీలలో ఎప్పటికప్పుడు ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలన్నారు. పెండింగ్ లో ఉన్నఎన్. బి. డబ్ల్యూఎస్ పై ప్రత్యేకంగా డివిజన్ పరిధిలో టీమ్స్ ఏర్పాటుచేసి త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసులలో చాలా రోజులలో పెండింగ్లో ఉన్న ఎన్.బి.డబ్ల్యూ చేయాలన్నారు. అవసరం అయితే ఎల్.ఓ.సి లు పెట్టాలన్నారు. సైబర్ మోసాల నియంత్రన కోసం 1930 ఫోన్ నెంబర్ గురించి ప్రజలకు అవగాహణ కల్పించాలని, అన్ని పోలీస్ స్టేషన్ పరిదులలో పెట్రోలింగ్ ముమ్మరం చేయడం, బీట్ల ఏర్పాటు, రాత్రి సమయాలలో వాహనాల తనిఖీ చేసి దొంగ తనాల నివారణకు కృషి చేయాలన్నారు. ఎటువంటి చిన్న నేరాలు జరుగకుండా సంబంధిత అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు. డయల్ 100 ఫిర్యాదుల పట్ల త్వరితగతిన స్పందించాలని అన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, ఏ.సి.పిలు, సి.ఐలు, ఎస్.ఐలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్ పెక్టర్ శ్రీశైలం పాల్గొన్నారు.

# అమ్మ పేరుమీద ప్రతి ఒక్కరు మొక్కనాటాలి

### అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు అమ్మ పేరు మీద మొక్కను నాటాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్త పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామప్రకాష్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా దుబ్బ చౌరస్తాలో నిర్వహించిన మొక్కల పంపిణి కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జనసంఘ్ వ్యవస్థాపక స్థాపకులైన ముఖర్జీ దేశ సమగ్రత, ఐక్యత కోసం హిందువులలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించడం ద్వారా జాతీయ పునర్నిర్మాణం జరుగుతుందనే లక్ష్యంతో బీజేఎస్ స్థాపించడం జరిగిందన్నారు. జాతి ఐక్యతను ముప్పుగా భావించే ఆర్టికల్ 370ని ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకంచారని అన్నారు. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహి ఛాలెంగే ఒకే దేశానికి రెండు రాజ్యాంగలు, ఇద్దరు ప్రధానులు, రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదు అన్నారు. నరేంద్రమోదీ ముఖర్జీ ఆశయాలకు, ఆకాంక్షాలకు అనుగుణంగా 370 ఆర్టికల్ రద్దుచేసి కాశ్మీర్ ను సుందరికరణ చేయడాన్ని మనం చూస్తున్నాం అన్నారు. ముఖర్జీ పార్టీ కోసం అహర్నిశలు శ్రామిస్తూ తన జీవితాన్నే అంకితం చేసి అతని మరణం కూడా నిర్బంధం లోనే ఒక మిస్ట్రీగా మిగిలిపోయిందన్నారు. ఆ మహనీయుని త్యాగానికి గుర్తుగా బలిదాన్ దివస్ జరుపుకుంటున్నాం అని తెలియజేసారు. బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా పెరుగుతున్న కాలుష్యన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు అమ్మపేరుమీద ఒక్క మొక్కను నాటలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు ఎమ్మెల్యే మొక్కలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పంచ రెడ్డి ప్రవళిక, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, దుబ్బ మండల అధ్యక్షుడు గడ్డం రాజు, ఇంటలెక్చువల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ కొండా ఆశన్న, తాజా మాజీ కార్పొరేటర్ మాస్టర్ శంకర్, మహిళా మోర్చా మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె నోటీసు అందజేసిన మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

మున్సిపల్ కార్మిక సంఘాల ఏఐటీయూసీ, టియుసిఐ, సీఐటీయూ జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మేనేజర్ కు జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వై. ఓమయ్య, టీయూసీఐ జిల్లా కార్యదర్శి ఎం. సుధాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఏ. రమేష్ బాబులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కనీస వేతనాల అమలు కోసం, కనీస పెన్షన్ 9వేల అమలు కోసం, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొంటారన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పి. హన్మండ్లు, రాధాకుమార్, భానుచందర్, డి. కిరణ్, ఎన్. రవికుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాతో 9రోజుల్లో రూ. 9,000కోట్లు జమ..



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద 9రోజుల్లోనే రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు పేర్కొన్నారు. పంటలు వేసే సమయానికి ఈ నిధులు అందడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలువురు నాయకులు ప్రశంసించారు. మంగళవారం ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, జాన్కంపేట్ రైతు వేదికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, రైతులు టపాకాయలు కాల్చి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఈ సందర్భంగా పలువురు నాయకులు, రైతులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏవో సిద్దిరామేశ్వర్,ఎడపల్లి సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి, బొబ్బిలి శ్రీనివాస్,నాయకులు రాధాకిషన్ గౌడ్, ఎల్లయ్య యాదవ్, విజయ్ గౌడ్, కిషోర్, కామప్ప,శంకర్ నాయుడు, శ్రీనివాస్,గాందరి హన్మంత్ రెడ్డి,సంజయ్,తహెర్,మాచుకూరి గంగాధర్,రంజిత్, కన్నా, ఏఈఓ జ్యోతి, శ్రీహరి,తదితరులు పాల్గొన్నారు.

# సంబరాలు జరుపుకున్న రైతులు, నాయకులు

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ రైతు భరోసా నిధులను విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో గల రైతు వేదిక వద్ద రైతులు,కాంగ్రెస్ నాయకులు కలిసి సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్,వైస్ చైర్మన్ వసంత్,నాయకులు శరత్ రెడ్డి,అంకు దాము, హరికాంత్ చారి, ఇమ్రాన్,ఆదినారాయణ,రాములు,కలీం,నవీన్,విష్ణువర్ధన్, చిత్రాల ప్రమోద్ కుమార్,పాల్గొన్నారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
బుధవారం,
25-06-2025


# దేశ ప్రజలందరి సమగ్ర అభివృద్దే నరేంద్ర మోడీ ప్రభుత్వ లక్ష్యం

**బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

దేశంలోని అన్ని రంగాలు, అన్ని ప్రాంతాల ప్రజల సర్వతో ముఖాభివృద్ధి కోసమే నరేంద్ర మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధితో గత 11 సంవత్సరాలుగా పనిచేస్తున్నదని, రానున్న రోజులలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా మలిచేందుకు నిరంతర కృషిని కొనసాగిస్తామని, అందుకోసం దేశ ప్రజలందరి మద్దతు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు సామి యాదవ్ వ్యాఖ్యానించారు. బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిజామాబాద్ రూరల్ మండల్ మల్లారం గ్రామం ప్రజలతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమనికి 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వము ప్రజలకు చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా 81 కోట్లకు పైగా లబ్ధిదారులకు ప్రధానమంత్రి కళ్యాణ్ యువజన ద్వారా ఉచిత రేషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా 4కోట్లకు పైగా ఇల్లు నిర్మాణం,15 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాలకు ఘర్ ఘర్ జల్ యోజన ద్వారా నల్ల కనెక్షన్లు కనిపిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అద్భుతమైన పథకాల ద్వారా ప్రజలకి అభివృద్ధి ఫలాలను అందించడం కోసం కృషి చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి భారత ప్రజలందరూ తమ మద్దతును తెలుపుతున్నట్టు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని,కేంద్ర



ప్రభుత్వ పథకాల ద్వారా ఎంతో మంది ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతున్నదన్నారు. ప్రజలు మరింత అవగాహన పెంచుకొని అర్హత కలిగిన అన్ని పథకాలకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామం నాయకులు మాజీ ఉపసర్పంచ్ చికోటి రవి, సొసైటీ డైరెక్టర్ గోపి, బొల్లం గంగాధర్, దశరథ, మోహన్, గంగాధర్, రాజకుమార్, ఓబీసీ ఐటీ సెల్, ఓబీసీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

## టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జగదీశ్వర్ గౌడ్ నియామకం

**నియామక పత్రాన్ని అందజేసిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియామక పత్రాన్ని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతులమీదుగా స్వీకరించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్..టీపీసీసీ కార్యవర్గ సమావేశం - గాంధీ భవన్‌లో నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీ భవన్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది..ఈ సమావేశానికి ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుకి నియామక పత్రాలు అందజేశారు..ఈ కార్యక్రమంలో



టీపీసీసీ ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, పలువురు నాయకులు హాజరయ్యారు.

## నిజామాబాద్‌ను మాదకద్రవ్య రహిత జిల్లాగా మారుద్దాం...

**జిల్లా మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ స్వప్న....**



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకుండా యువత వాటికి దూరంగా ఉండాలని జిల్లా మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ స్వప్న పిలుపునిచ్చారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు.మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం,అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలైన పొగాకు, గంజాయి,హెరాయిన్,కొకైన్, అల్ఫజోమ్ వంటి వాటికి బానిసలు కావద్దని ఆమె సూచించారు. వీటి వినియోగం వల్ల ఉజ్వల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు సమాజంలో అభాసుపాలు అవుతారని హెచ్చరించారు.విద్యార్థులు,యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అలాంటి వారికి డీ అడిక్షన్ సెంటర్లలో కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మత్తుపదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని,ఎవరైనా మత్తు పదార్థాలు వాడితే 100,14446, 1908 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని స్వప్న కోరారు.ఐసీడీఎస్ ఎడపల్లి క్లస్టర్ సూపర్వైజర్ విజయరాణి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గంగాశంకర్, ఏఎస్సై ఇలియాస్ అలీ, జల్జీవన్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సీఈఓ రవి, ఏఎన్ఎం మాధవి లత, అంగన్‌వాడీ టీచర్ తులసి, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా.. 9రోజుల్లో రూ. 9,000కోట్లు



టైమ్స్ ఆఫ్ వార్త -మాక్లూర్.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద 9రోజుల్లోనే రూ. 9,000 కోట్లు, ఇప్పుడివరకు 111 ఎకరాలకు కోటి 49 లక్షల 39 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసిందని, మాక్లూర్ సొసైటీ చైర్మెన్ బూరోళ్ల అశోక్ మార్కెట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు  అన్నారు. .  మండలంలోని గొటుముకుల, మాక్లూర్ లో గల రైతు వేదికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు,  మండల అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ముందుగా  కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి టపాకాయలు కాల్చి,స్వీట్లు పంచుకొని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.   , కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులేనిదే రాజ్యం లేదని,ఎప్పుడు రైతు క్షేమం కొరకు పాటుపడుతుందని, అన్నారు. పలువురు నాయకులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఎ ఐ సీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖాడ్గే కి పి సిసి మహేష్ గౌడ్ కి, సోనియా గాంధీకి ,రాహుల్ గాంధీకి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు..ఈకార్యక్రమంలో వీరితోపాటు,మండల ప్రత్యేక అధికారి ముత్తన్న, ఎం పి డి ఒ లక్ష్మా రెడ్డి,ఎంపీఓ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారిని పద్మ, సొసైటీ వైస్ చైర్మన్  శేఖర్, ఎ ఈ ఒ మహేందర్,రైతులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## సాలూరలో రైతు భరోసా సంబరాలు...



టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

ప్రభుత్వం రైతుభరోసా కింద 9 రోజులలో రూ.9,000 వేల కోట్లు రైతుల ఖాతాలలో జమ చేయడం పట్ల సాలురా మండల కేంద్రంలో రైతులు,కాంగ్రెస్ నేతలు కలిసి సంబరాలు నిర్వహించారు.రైతు వేదిక వద్ద టపాసులు పేల్చి ,మిఠాయిలు పంచిపెట్టారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతు భరోసా అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంధర్నా రవి,మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఖాజాపూర్ అశోక్, మాజీ సోసైటీ చైర్మన్ బసారే శివకాంత్,నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ లో ఉత్సాహంగా రైతు సంబరం

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

నిజామాబాద్ జిల్లాలో ఉత్సాహభరిత వాతావరణంలో రైతు విజయోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. వానాకాలం ం 2025 సీజన్ కు సంబంధించి ముందస్తు పంట పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భంగా మంగళవారం రైతు సంబరాలు నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల వద్దకు అన్నదాతలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఉత్సాహంగా ఈ సంబరాలలో పాల్గొన్నారు. రైతు భరోసా నిధులు తొమ్మిది రోజుల వ్యవధిలోనే పూర్తి స్థాయిలో బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వం జమ చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రైతు వేదిక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని ఎంతో ఆసక్తితో వీక్షించారు. డిచ్పల్లి మండలం



యానంపల్లి రైతు వేదిక నుంచి ఆదర్శ రైతులతో కలిసి కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, మండల వ్యవసాయ




అధికారిణి మాధురి, సొసైటీల చైర్మన్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ముద్ర మంజీరం నృత్యోత్సవంలో శ్రీ వర్షితి




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

విజయ మాధవి సేవా సంస్కృతి అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన ముద్ర మంజీరం నృత్యోత్సవంలో నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లోని విజయ్ హై స్కూల్ విద్యార్థి ఎస్. శ్రీ వర్షితి అద్భుత ప్రతిభను ప్రదర్శించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహించిన విద్యార్థుల్లో విజయ్ హై స్కూల్లో 3వ తరగతి చదువుతున్న శ్రీ వర్షితి కూచిపూడి నృత్యాన్ని  అభినయించి జ్ఞాపికను ప్రశంస పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్ హై స్కూల్ వ్యవస్థాపకరాలు డాక్టర్ అమృతలత అభినందించారు.

## రేషన్ బియ్యం పట్టివేత

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

అను మతులు లేకుండా తరలిస్తున్న బియ్యాన్ని బోధన్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం సాటాపూర్ నుండి బోధన్ వెళ్లే మార్గ మధ్యంలో పెగడపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బోధన్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు.ఆటో డ్రైవర్ వద్ద బియ్యంకు సంబందించిన పత్రాలు లేక పోవడంతో ఆటో ను పోలీస్ స్టేషన్ కు తర లించారు. సుమారు రెండు టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు స్థానికులు తెలిపారు.



## ఇరాన్ పై అమెరికా సామ్రాజ్య వాదం యుద్ధం ఆపాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్**



టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గం లోని దిలీకుష్ నగర్ లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఇరాన్ పై అమెరికా సామ్రాజ్య వాదం చేస్తున్న యుద్ధం కీ నిరసన గా  నిరసన వ్యక్తం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమం లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడుతు ఆయుధాల అమ్మకం కోసం అమెరికా సామ్రాజ్య వాదం చేస్తున్న వ్యాపారం కోసం దేశాల మధ్య యుద్దాలు కోరుకోవడం అమెరికా అహంకారం కీ నిదర్శనం,  ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అని యుద్దాల మధ్య శాంతి చర్చలు జరగాలి అని అన్నారు ఇజ్రాయిల్ పాలస్థిన పై అహంకారపూరిత దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం పాలస్తినాలో పుట్టిన పసి పిల్లవాడు కూడా దేశ విద్రోహులు అనడం దుర్మార్గమని,  ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఇజ్రాయిల్ కి అమెరికా సామ్రాజ్యవాదం మద్దతు ఇవ్వడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యురాలు ఏ. విజయ,పర్వీన్, రెహానా, పద్మ, సువర్ణ, విరాజ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్సీ విజయశాంతి జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు**



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఎమ్మెల్సీ విజయశాంతి జన్మదిన వేడుకలు మంగళవారం వారి నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సీనియర్ పాత్రికేయులు కోటగడ్డ శ్రీనివాస్, పంతం వెంకటేశ్వర్లు ఎమ్మెల్సీ విజయశాంతిని వారి నివాసంలో కలిసి పూల బొకే అందించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో, మరింత ఉన్నత  పదవులు పొందాలని ఆకాంక్షించారు...

TIMES OF VARTHA (25-06-2025)1_times of varha main (13-2).qxd 6/25/2025 6:13 AM Page 7



# ఎడపల్లిలో ఏక్ పేడ్ మాకే నామ్..పర్యావరణ పరిరక్షణకు వినూత్న అడుగు..

టైమ్స్ ఆఫ్ వార్త – ఎడపల్లి





పర్యావరణ పరిరక్షణ,ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఎడపల్లి మండలంలో ఏక్ పేడ్ మాకే నామ్ (తల్లి పేరు మీద ఒక చెట్టు) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమం ఎడపల్లి అంగన్‌వాడీ 2కేంద్రంలో మొక్కలు నాటడంతో ప్రారంభమైంది.ఎడపల్లి సెక్టార్ సూపర్వైజర్ విజయరాణి ఈకార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటడం ద్వారా పర్యావరణానికి గొప్ప సేవ చేయవచ్చని ఆమె అన్నారు. ఇది కేవలం మొక్క నాటడం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించే దిశగా వేసే అడుగు అని విజయరాణి పేర్కొన్నారు.ఈ కార్యక్రమం పిల్లల్లో పర్యావరణ స్పృహను పెంపొందించడంలో ఎంతగానో తోడ్పడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని విజయరాణి అందరికీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్థానిక ప్రజలు,పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై కాంగ్రెస్ నేత నర్సింగ్ వ్యాఖ్యలు హేయం

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:–



జర్నలిస్టుల ఆత్మగౌరావాన్ని కించపరుస్తూ కాంగ్రెస్ నేత పైడిమల్ల నర్సింగ్ సోమవారం సోషల్ మీడియా వేదికగా సందేశాలు పెట్టడం హేయమైన ఘటన అని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జె రవీందర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జర్నలిస్ట్ లపై ప్రతికార చర్యకు పాల్పడుతున్న పట్టణ కాంగ్రెస్ నాయకుడు పైడిమల్ల నర్సింగ్ పై పోలీస్ కేసు నమోదు చేయడంతో పాటు ఆయనపై కాంగ్రెస్ పార్టీ సైతం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ పోలీసుల బాధ్యత రాహిత్యానికి జర్నలిస్టులు సైతం బాధితులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా నాయకుల ఎదుగుదలకు తోడ్పాటు అందిస్తూ, సమాజంలో ప్రజల వివిధ సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తున్న జర్నలిస్టులపై నిరంకుశంగా, నియంతల వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు పరాకాష్టకు నిదర్శనమని విమర్శించారు. సమాజంలో కులాలు మతాలు మధ్య ఉన్న మనోభావాలు దెబ్బతీస్తూ శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం మంచిది కాదని సూచించారు. ఇలాంటి వ్యక్తిని రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సస్పెండ్ చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో మంచి నాయకులు ఉన్నారని, ఇలాంటి నాయకుల నియంత తీరుతో పార్టీలో మిగత నాయకులు సమస్యల పాలై, ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకొని మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిబిజికేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, నాయకులు మద్ది శంకర్, బండారి సూర్యనారాయణ, ఎండి అబ్బాస్, తోట సురేందర్ బోరిగం వెంకటేష్, మేడిపల్లి మల్లేష్, సిపెల్లి సాగర్ లు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించిన కఠిన చర్యలు తప్పవు

**జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి**

**- చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ**

**- వివిధ కేసుల్లో ఘర్షణలకు పాల్పడ్డ పదిమంది రిమాండ్ కు తరలింపు**

టైమ్స్ అఫ్ వార్త – చంద్రుగొండ



చంద్రుగొండ మండలంలో శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జూలూరు పాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసే నారెడ్డి, చంద్రుగొండ ఎస్సై శివ రామ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఇటీవల చంద్రుగొండ మండలంలో కొంతమంది ఘర్షణలకు పాల్పడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విగాథం కలిగిస్తున్న పదిమంది వ్యక్తులను రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు. అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన బత్తుల సాయిరాం, బత్తుల గణేష్, బత్తుల శ్రీను, బత్తుల గురుస్వామి, బత్తుల వెంకటేశ్వర్లు, దేరంగుల విజయ్ కుమార్, దేరంగుల సంతోష్ కుమార్, పోకులగూడెం గ్రామానికి చెందిన బానోతు లచ్చిరాం, బానోతు నరసింహ, బానోత్ అనసూర్య, లపై కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలిం చడం జరిగిందన్నారు. అయన్నపాలెం లో కొట్లాట కేసులు ఏడుగురిపై, పోకలగూడెంలో దారి వివాదంలో జరిగిన ఘర్షణపై ముగ్గురును రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. చంద్రుగొండ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టాన్ని ఎవరు చేతిలో తీసుకున్న ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించేది లేదన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఘర్షణలకు ఎవరు పాల్పాడిన వారు ఎంతటి వారైనా వారిపై చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే బైండవర్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. మండలంలో అందరూ సోదర భావంతో మెలగాలని కోరారు.

# జర్నలిస్టుపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

**టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు**

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:–



పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేత పైడిమల్ల నర్సింగ్ సోమవారం సోషల్ మీడియా వేదికగా సూర్య పత్రిక రిపోర్టర్ మడ్డి వేణుగోపాల్ తోపాటు జర్నలిస్టులు, పత్రికల పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జనరేషన్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నర్సింగ్ వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని పాత్రికేయులు నిర్వహిస్తున్న పోరాటానికి సంఘం తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యలో వారధిగా ఉంటూ, ఎన్నో కష్టనష్టాలను ఓర్చి, ప్రజా సమస్యలను అధికార వర్గాల దృష్టికి తీసుకువెళ్ళి, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నిస్వార్థంగా సేవ చేస్తున్న జర్నలిస్టులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. జిల్లాలో ఏ జర్నలిస్టునైనా కించపరిచేలా, భయభ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించిన, ఇతర ఇబ్బందులకు గురిచేసిన ఫెడరేషన్ వారికి మద్దతుగా ఉంటూ, పోరాటం చేస్తుందని తెలిపారు. జర్నలిస్టుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వారిని ఉపేక్షించేది లేదని, ప్రభుత్వాలు సైతం వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కామెర వెంకట స్వామి, కోశాధికారి సబ్బని భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శానగొండ శ్రీనాథ్, జాయింట్ కార్యదర్శి జి సురేందర్, నాయకులు సుమన్, నరేష్, సతీష్, వీరస్వామి లు పాల్గొన్నారు.

# వచ్చే నెల 4న హైదరాబాద్‌కు మల్లిఖార్జున ఖర్గే

హైదరాబాద్ : ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వచ్చే నెల 4న హైదరాబాద్‌కు రానున్నారు. మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే సభలో ఖర్గే పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ సభను విజయవంతం చేయడానికి పార్టీ నూతన కార్యవర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. నూతన కార్యవర్గంతో కూడా ఖర్గే సమావేశమవుతారని ఆయన తెలిపారు.

# టిజి ఎస్ ఆర్టీసీ వారు ప్రయాణికుల అందిస్తున్న మరో అద్భుత అవకాశం..

**తక్కువ ఖర్చుతో ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శన...**

**ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోగలరు..**

**డిప్యూటీ ఆర్ ఏం అపర్ణ కళ్యాణి**

టైమ్స్ ఆఫ్ వార్త– కూకట్ పల్లి




కూకట్ పల్లి డివిజన్ టిజి ఎస్ ఆర్టీసీ వారు అందిస్తున్న తక్కువ ఖర్చు ఎక్కువ ప్రయాణం సురక్షితం. ఆర్టీసీ సిబ్బంది చేయనున్న మంచి అవకాశం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఆర్టీసీ ఉన్నత అధికారులు కోరుతున్నారు. కూకట్ పల్లి డివిజన్ ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సు లను ఏర్పాటు చేశారు.. ఇంత మంచి సువర్ణవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు, 6301400074, 9177155057 ఫోన్ నెంబర్స్ లలో సంప్రదించాలని కూకట్ పల్లి డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి తెలియజేసారు..

# విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)..

రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా.. అంటూ సిఎం రేవంత్‌రెడ్డికి ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రైతుల బతుకులు సంక్షోభంలో కూరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్న రైతన్న నేడు ప్రభుత్వ పథకాలు అందక పంట పొలాల్లోనే కుప్ప కూలుతున్నారని వాపోయారు. బిఆర్ఎస్‌ది రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే, కాంగ్రెస్‌ది రైతు సంక్షోభ ప్రభుత్వం అని పేర్కొన్నారు. కెసిఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే, మీరు ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇచ్చి మభ్య పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న రేవంత్‌రెడ్డి జిమ్మిక్కులను రైతులు నమ్మరు అని పేర్కొన్నారు. రైతులను కన్నీళ్లు పెట్టించినందుకు, ఉసురు తీసుకున్నందుకు విజయోత్సవాలు కాదు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయాలని హరీష్‌రావు హితవు పలికారు.



# నామినేటెడ్ పదవుల్లో కరుణాకర్ రెడ్డికి అవకాశం ఇవ్వాలి..

**జె ఎన్ టి యూ హెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు దిలీప్**

**సి ఏం రేవంత్ రెడ్డికి జెఎన్‌టియూహెచ్ విద్యార్థి నాయకుల విజ్ఞప్తి**

టైమ్స్ ఆఫ్ వార్త– కూకట్ పల్లి



జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ హైదరాబాద్. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థగా గుర్తింపు పొందింది. లక్షలాది విద్యార్థులు ఈ విశ్వవిద్యాలయంతో అనుబంధం కలిగి ఉండి, ప్రభుత్వ, ప్రైవేట్, ఐటీ రంగాల్లో ఉద్యోగాల ద్వారా రాష్ట్ర భవిష్యత్తును రూపొందిస్తున్నారు. అయినప్పటికీ, ఈ విద్యార్థులను ప్రాతినిధ్యం వహించే జె ఎన్ టి యూ హెచ్ విద్యార్థి నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం లభించకపోవడం ఆందోళనకరం. ఈ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాము.జెఎన్‌టియూ హెచ్‌లో రాష్ట్రంలో ఇంజనీరింగ్, టెక్నాలజీ, వృత్తిపరమైన కోర్సులను అందించే ప్రముఖ సంస్థ. ఈ విశ్వవిద్యాలయంతో అనుబంధం కలిగిన లక్షలాది విద్యార్థులు తమ నైపుణ్యాలతో సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థి నాయకులు విద్యార్థుల సమస్యల పరిష్కారంలో, వారి హక్కుల కోసం పోరాటంలో, విశ్వవిద్యాలయ అభివృద్ధిలో నిరంతరం కృషి చేస్తున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో వీరికి సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడం నిరాశాజనకం. జె ఎన్ టి యూ హెచ్ విద్యార్థి నాయకులు ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థుల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. విద్యా సంస్థల్లో సమస్యలను ఎదుర్కొంటూ, విద్యార్థుల గొంతుకగా నిలిచారు. అయినప్పటికీ, రాష్ట్రంలోని నామినేటెడ్ పదవుల్లో ఒక్క అవకాశం కూడా లభించకపోవడం ఆశ్చర్యకరం. లక్షలాది విద్యార్థులను ప్రాతినిధ్యం వహించే ఈ సంస్థ నుండి ఒక్క నామినేషన్ కూడా లేకపోవడం విద్యార్థి సమాజంలో నిరాశను కలిగిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు, విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తూ వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఈ నేపథ్యంలో, జె ఎన్ టి యూ హెచ్ విద్యార్థి నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నాము. ఈ చర్య విద్యార్థి సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాక, రాష్ట్ర అభివృద్ధిలో వారి పాత్రను బలోపేతం చేస్తుంది.జె ఎన్ టి యూ హెచ్ విద్యార్థి నాయకుల సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, విద్యార్థుల సమస్యలపై అవగాహన వారిని నామినేటెడ్ పదవులకు అర్హులుగా చేస్తాయి. వారికి అవకాశం కల్పించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి సమాజం పట్ల తన నిబద్ధతను చాటుకుంటుంది. ఈ చర్య లక్షలాది విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, తెలంగాణ యువత భవిష్యత్తును ఉజ్వలం చేస్తుంది. ఈ పత్రికా సమావేశంలో పాల్గొన్న విద్యార్థి నాయకులు: డాక్టర్ శాడగొండ కరుణాకర్ రెడ్డి, జవ్వాజి దిలీప్, అంబటి తేజ, బోయపల్లి అశోక్ గౌడ్, ఎర్రవెల్లి జగన్, లకావత్ భానుప్రకాష్ నాయక్, స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు రాహుల్ నాయక్, శివ కృష్ణ, దుర్గా ప్రసాద్, సాగర్ నాయక్, ఎన్ టి వి ఎస్ నాయకులు పవన్ కుమార్, రోషన్, జాక్ నాయకులు తేజ, శ్రవణ్ కుమార్, బంజార విద్యార్థి సంఘం నాయకులు శశి కుమార్, సురేష్, రవి, కార్తీక్, పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సేవలో పరిపూర్ణులు వివేరా హెూటల్స్ ఎండి సద్ది వెంకటరెడ్డి

**రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలికళ్ళ పరీక్షలు**

టైమ్స్ ఆఫ్ వార్త – యాదాద్రి



తెలంగాణ రాష్ట్ర హెూటల్స్ సంఘం నాయకులు, వివేరా హెూటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సద్ది వెంకటరెడ్డి జీవితంలో 72 సంవత్సరాల అధ్యాయం ముగిసి 73 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా మీరు ఎక్కువగా ఇష్టపడే వ్యక్తుల మధ్య నిర్వహించి రక్తం రక్తదాన శిబిరం, మధ్య ఆనందంగా జన్మదిన వేడుకలను జరుపుకోవడం ఆనంద దాయకమని, భవిష్యత్తులో ఆరోగ్యకరమైన అత్యుత్తమైన జీవితం గడపాలని, యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వివేరా హెూటల్ లో హైదరాబాద్ విద్యానగర్ రెడ్ క్రాస్ సొసైటీ వారు నిర్వహించిన రక్తదాన శిబిరానికి అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్ డి ఓ కృష్ణారెడ్డి, భువనగిరి తహసిల్దార్ అంజిరెడ్డిలు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 74 మంది వ్యక్తులు తమ రక్తాన్ని దానం చేయడమే గాక, డాక్టర్ ఉష ఆధ్వర్యంలో 64 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన పరికరాలను అందజేయడానికి సిఫారసు చేశారు. తెలంగాణ రాష్ట్ర హెూటల్స్ సంఘం అధ్యక్షులుగా కొనసాగినప్పుడు రాష్ట్రంలో వేలాదిగా నెలకొని ఉన్న హెూటల్స్ లా హక్కుల సాధన కోసం ఎంతగానో కృషి చేశారని ఆయన కొనియాడారు. జాతీయ రహదారిపై కలిగి ఉన్న హెూటల్స్ వివేరా కు అత్యుత్తమ హెూటల్ గా ఎన్నో అవార్డులు పొందిందని, వినియోగదారులకు ఆర్గానిక్ కూరగాయలతో సిద్ధం చేసిన కూరగాయలతో సేవలందిస్తూ గొప్ప పేరు సంపాదించారని కొనియాడారు. ఇదిలా ఉండగా తన జీవితకాలంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలతో పాటు రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలలో పాల్గొన్నారన్నారు. అంతేగాక మానవతా దృక్పథంతో నిర్మించే విస్తృతస్థాయి కార్యక్రమాలలో ఆయన పాల్గొని సేవలు అందించడం హర్షిని ఏమని అన్నారు. ఆపగలలో ఉన్నవారికి రక్తదానం అందించేందుకు నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలలో ప్రజలు విస్తృతంగా పాల్గొని తమ రక్తాన్ని దానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ జన్మదినం వేడుకలు తమ సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది, శ్రేయోభిలా షులు, వివిధ సంస్థల నాయకులు, విద్యావంతుల మధ్య నిర్వహించు కోవడం హర్షణీయమన్నారు.



since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



## ఎస్‌డిజి ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్ 100 లో భారత్



న్యూఢిల్లీ : సుస్థిర అభివృద్ధి లక్షాల (ఎస్‌డిజి)సాధనలో పురోగతి ర్యాంక్ పొందిన 193 దేశాల్లోని మొదటి 100 దేశాల్లో భారత్ మొదటిసారి స్థానం సంపాదించింది. యుఎన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సల్యూషన్స్ నెట్‌వర్క్‌కు చెందిన 10వ, తాజా సస్టైనబుల్ డెవలప్‌మెంట్ రిపోర్టు (ఎస్‌డిఆర్)ప్రకారం 2025 ఎస్‌డిజి ఇండెక్స్‌లో 67 స్కోరుతో 99వ స్థానంలో ఉండగా, చైనా 74.4 పాయింట్లలో 49 వ స్థానంలో, అమెరికా 75.2 పాయింట్లతో 44 వ స్థానంలో ఉన్నాయి. భారత్ దేశం పొరుగున ఉన్న భూటాన్ 70.5 పాయింట్లతో 74 వ స్థానంలో , నేపాల్ 68.6 పాయింట్లతో 85 వ స్థానంలో , బంగ్లాదేశ్ 63.9 పాయింట్లతో 114 వ స్థానంలో , పాకిస్థాన్ 57 పాయింట్లతో 140 వ స్థానంలో ఉన్నాయి. అలాగే భారతదేశానికి సమీపాన ఉన్న మాల్దీవులు , శ్రీలంక దేశాలు వరుసగా 53, 93 స్థానాల్లో నిలిచాయి. 2015 లో ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు ఆమోదించిన 17లక్షాలలో 2030 నాటికి కేవలం 17 శాతం మాత్రమే సాధించబడుతుందని అంచనా వేయడంతో , ప్రపంచ స్థాయిలో ఎస్‌డిజి పురోగతి నిలిచిపోయిందని నివేదిక పేర్కొంది. " సంఘర్షణలు, వ్యవస్థాపరమైనరి దుర్బలత్వాలు, పరిమిత ఆర్థిక అవకాశాలు ప్రపంచం లోని అనేక ప్రాంతాల్లో ఎస్‌డిజి పురోగతికి ఆటంకం కలిగిస్తాయి" అని ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక వేత్త జెఫ్రిసాచ్స్ ప్రధాన రచయితగా ఉన్న ఈ నివేదిక పేర్కొంది. యూరోపియన్ దేశాలు, ముఖ్యంగా నార్డిక్ దేశాలు ఎస్‌డిజి సూచికలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. ఫిన్లాండ్ మొదటి స్థానంలో, స్వీడన్ రెండో స్థానంలో , డెన్మార్క్ మూడోస్థానంలో ఉన్నాయి. టాప్ 20 దేశాల్లో మొత్తం 19 దేశాలు యూరప్ లోనే ఉన్నాయి. అయినప్పటికీ ఈ దేశాలు కూడా కనీసం రెండు లక్షాలను సాధించడంలో ముఖ్యమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. వాటిలో వాతావరణం, జీవవైవిధ్యానికి సంబంధించిన సమస్యలు కూడా ఉన్నాయి. ఎక్కువగా భరించలేని వినియోగం కారణమని నివేదిక రచయితలు పేర్కొన్నారు. 2015 నుండి తూర్పు, దక్షిణాసియాలు ఎస్‌డిజి పురోగతి పరంగా అన్ని ఇతర ప్రపంచ దేశాల కంటే మెరుగైన పనితీరు కనబరిచాయి. వేగవంతమైన సామాజిక, ఆర్థిక అభివృద్ధే కారణం. ఈ దేశాల్లో నేపాల్, కంబోడియా, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్, మంగోలియా ఉన్నాయి. వేగంగా పురోగతి సాధిస్తున్న ఇతర దేశాల్లో బెనిన్, పెరూ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉజ్బెకిస్థాన్, కోస్టారికా, సౌదీ అరేబియా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్త లక్షాలలో 17శాతం మాత్రమే సాధించాల్సిన మార్గంలో ఉన్నప్పటికీ, చాలా యుఎన్ సభ్యదేశాలు మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగం, విద్యుత్ లభ్యత, ఇంటర్నెట్ వినియోగం, ఐదేళ్ల లోపు పిల్లల మరణాల రేటు, నవజాత శిశు మరణాలు, వంటి ప్రాథమిక సేవలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన లక్షాలపై బలమైన పురోగతి సాధించాయి. 2015 నుంచి ఐదు లక్షాలు చాలా తిరోగమనాలను చూపిస్తున్నాయి. అవి ఊబకాయం రేటు, పత్రికా స్వేచ్ఛ, స్థిరమైన నత్రజని నిర్వహణ, రెడ్‌లిస్ట్ ఇండెక్స్, అవినీతి సూచికగా ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి బహుపాక్షికతకు అత్యంత కట్టుబడి ఉన్నమొదటి మూడు దేశాలు బార్బడోస్, జమైకా, ట్రినిడాడ్‌టొబాగో అని నివేదికలో పేర్కొన్నారు. జి20 దేశాల్లో బ్రెజిల్ అత్యల్పస్థానంలో ఉండగా, ఒఇసిడి దేశాల్లో చిలీ ముందంజలో ఉంది. స్పెయిన్ లోని సెవిల్లెలో జూన్ 30 నుంచి జులై 3 వరకు జరగనున్న నాలుగో అంతర్జాతీయ అభివృద్ధి ఆర్థిక సదస్సు నేపథ్యంలో ఈ నివేదిక వెలువడింది. ప్రపంచ ఆర్థిక నిర్మాణం విచ్ఛిన్నమైందని ఈ నివేదిక గుర్తించింది.

# ఆగస్టు 15 నాటికి 'భూ భారతి' దరఖాస్తుల పరిష్కారం

**రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు**

**ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలి**

**ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పై వీసీ ద్వారా కలెక్టర్లతో సమీక్షించిన సీఎస్**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం : కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి**

టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ జిల్లా ప్రతినిధి



వచ్చే ఆగస్టు 15 నాటికి భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామకృష్ణా రావు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్ లైన్ ద్వారా అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ భాగస్వాములయ్యారు. వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాల పై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. 2లక్షల 30 వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని సీ.ఎస్ అన్నారు. భారీ వర్షాలు కురియక ముందే ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ సీనరేజీ ఛార్జీలను కూడా ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంతవరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. కాగా, పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద రాష్ట్రానికి లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇండ్లకు పంపిణీ చేసే మొక్కల పెంపకం సైతం పరిశీలించాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ప్రతి జిల్లా పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకుని వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని, నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కో–ఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై రివ్యూ పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ ప్రొక్యూర్ చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. రిటైల్ విక్రయాలను డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల షాప్ వద్ద ఎక్కడ కొరత రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు ప్రస్తుత సంవత్సరం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. రైతులకు లాభసాటి పంట ఆయిల్ పామ్ పట్ల అవగాహన కల్పిస్తూ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా దాదాపు 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సాదా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ కార్యక్రమాలు చేపట్టాలి డెంగ్యూ, మల్లేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ వంటి పలు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వల్నరబుల్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి లక్షణాలు గల ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి అవసరమైన చికిత్స అందించాలని అన్నారు.

### వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలి.. మంత్రి కొండా సురేఖ

ఆన్ లైన్ నుంచి వీసి లో పాల్గొన్న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.., ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. జిల్లాలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనేలా ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. గతం కంటే మెరుగ్గా ప్రజల్లో వన మహోత్సవం కార్యక్రమం తీసుకుని వెళ్ళాలని, ప్రతి రోజూ ఒక్కో శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వసించాలని అన్నారు. జిల్లాలో వి.ఐ.పి పర్యటనల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పరిధిలో ఎత్తైన మొక్కలు నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అటవీ ప్రాంతంలో కోతులకు అవసరమైన పండ్ల మొక్కలను పెద్ద ఎత్తున బ్లాక్ ప్లాంటేషన్ పెంచాలని అన్నారు. జిల్లాలకు కేటాయించిన వన మహోత్సవం లక్ష్యాలను కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి.. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఈ సందర్భంగా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ., జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. ఇప్పటికే జిల్లాకు 19,490 ఇండ్లు కేటాయించగా, 15,834 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ ప్రొసీడింగ్స్ అందించామని, 7181 ఇళ్ల నిర్మాణాల గ్రౌండింగ్ జరిగిందని, ప్రస్తుతం వివిధ దశలలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తూ, లబ్ధిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లాలో 7075 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని సీఎస్ దృష్టికి తెచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల్లాగా నా పై నిఘా పెట్టారు

(మొదటి పేజీ తరువాయి)..

సహచరులు, వ్యక్తిగత సహాయకులతో పాటు తన భార్య జమునకు సంబంధించిన హ్యాచరీస్ ఉద్యోగులు, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేసారని ఈటల ఆరోపించారు. హుజురాబాద్ ఉప ఎన్నికలో తనను ఓడించేందుకు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి అడుగడుగునా ఇబ్బందులకు గురిచేసినట్టు వివరించారు. అలాగే గత ఎన్నికలలో గజ్వేల్, హుజూరాబాద్‌లో పోటీ చేసినప్పుడు కూడా ఫోన్ ట్యాప్ చేసారని, తనను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేకనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఈటెల ధ్వజమెత్తారు. ఐపిఎస్ అధికారి కాకపోయినా ప్రభాకర్ రావును ఉన్నత స్థాయి పదవీలో కూర్చోపెట్టారని విమర్శించారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన నిఘా విభాగాలు ముఖ్యమంత్రి వద్ద ఉంటాయని, అర్హత లేకపోయినా ఉన్నతాధికారిగా విధులు నిర్వహించిన ప్రభాకర్ రావుకు మాజీ సీఎం కెసిఆర్‌కు ఉన్న సంబంధం ఏమిటో బయటపెట్టాలని ఈటల డిమాండ్ చేశారు. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాప్ చేశామని, అలాగే ఇందుకు సంబంధించిన సాక్షాధారాలు, ధ్వంసం చేశామని ఈ కేసులో నిందితులు చెపుతున్నా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరగుతుందని ఆయన ప్రశ్నించారు. ఎవరి ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారో విచారణ చేసి దోషులను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. భార్య, భర్తలు మాట్లాడుకున్న ఫోన్‌లు వినడం ఎంతటి దుర్మార్గమైన చర్య అని, భవిష్యత్తులో ఇలాంటి పనులు చేయాలంటే భయపడే విధంగా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కాళేశ్వరం కమిషన్ ఏర్పాటు, ఫోన్ ట్యాపింగ్ విచారణ చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా విచారణ నత్తనడకన నడుస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందాల వల్లనే విచారణ ముందుకు పోకపోవడానికి కారణమని ఈటెల ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాకపోతే తాము సిబిఐ విచారణ జరిపించి దోషులకు శిక్ష పడే విధంగా చేస్తామని ఈటల సవాల్ చేసారు.

### ఈ ప్రభుత్వమూ ఫోన్ ట్యాపింగ్ చేయదన్న గ్యారంటీ లేదు: ప్రేమేందర్ రెడ్డి



ఈ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయదని నమ్మకం ఏమిటని రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రేమేందర్ రెడ్డి సిట్‌కు తన వాంగ్మూలం వినిపించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన రెండు ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు చెప్పినట్టు ఆయన తెలిపారు. ఫోన్ల ట్యాపింగ్‌తో నిరంతరం పార్టీ కార్యక్రమాలపై నిఘా పెట్టారని అన్నారు. గత ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ఫోన్లు ట్యాప్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసారు. సిట్ అధికారులు సుమారు నాలుగు వేల ఫోన్లు ట్యాప్ అయినట్టు చెపుతన్నా, కేవలం 600 మందిని మాత్రమే విచారిస్తామని చెబుతున్నారని, అలా అయితే న్యాయస్థానంలో ఈ కేసులు ఎలా నిలబడతాయని ఆయన ప్రశ్నించారు. ఈ కేసును సిబిఐ విచారణకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

## కష్టపడితేనే పదవులు..

(మొదటి పేజీ తరువాయి)..




నిధుల బాధ్యతలు కూడా మంత్రుల దగ్గరే ఉన్నట్టు ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం గెలిచేలా ఇన్‌చార్జి మంత్రులు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలపై ఇన్‌చార్జి మంత్రులు సరిగ్గా దృష్టి పెట్టడం లేదని అన్నారు. ఇక నుంచి జిల్లాలపై ఫోకస్ ఉండాలని సూచించారు. పీసీసీ కార్యవర్గంలో ఉన్న వారిని రెండు గ్రూపులుగా విభజించి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ముందు అందరికీ పని అప్పగించాలనీ, దీని ఆధారంగా పని చేసే వాళ్లను ఒక జాబితాలో పని చేయని వాళ్లని మరో జాబితాలో చేర్చాలని సూచించారు. పని చేస్తే ప్రమోషన్..లేదంటే డిమోషన్ ఉంటుందని గుర్తు చేశారు.

## చర్చకు రా.. తేల్చుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)..

యూనిఫాంలు కుట్టడం, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, ఐకేపీ ద్వారా 8 వేల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రూ.21 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు వంటి అనేక స్కీంలను అమల్లోకి తెచ్చామని వివరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుంటూ ప్రజలు చర్చలు జరపాలని పిలుపునిచ్చారు. రైతుభరోసా పంపిణీ పూర్తయ్యిందని 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. చంద్రబాబు కోసం తాను బనకచర్లకు గోదావరి నీళ్లను ఇస్తున్నట్టు విష ప్రచారం చేస్తున్నారనీ, ఉండాలనుకుంటే తాను అక్కడే ఉండేవాడినన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి అండగా ఉండాలనే కాంగ్రెస్‌లో చేరానని వివరణ ఇచ్చారు. సోనియాగాంధీ కాళ్లు మొక్కి, కడుపులో తలపెట్టి, నట్టేట ముంచిన చరిత్ర కేసీఆర్‌దని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్రమంత్రులంతా పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపండి

**విద్యాశాఖకు తక్షణమే మంత్రి నియమించాలి!**

**పి.డి.ఎస్.యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్**

టైమ్స్ ఆఫ్ వార్త – మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



తెలంగాణ రాష్ట్రంలో మూడు ఖాళీ మంత్రి పదవులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల భర్తీ చేసినా, విద్యాశాఖకు మాత్రం ఇప్పటికీ మంత్రి లేకపోవడం దారుణమైన నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని పీ.డి.ఎస్.యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ అన్నారు. ఇది కేవలం పాలనా వైఫల్యం మాత్రమే కాకుండా, రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తుపై నేరంగా జరిపే దాడిగా అభివర్ణించారు. "తాగుబోతులకు మంత్రి పదవి ఉంది. కానీ విద్యార్థులకు మాత్రం సమయం లేదు! ఇది ఎంతవరకు న్యాయం?" విద్యాశాఖకు నాయకత్వం లేకపోవడం వల్ల విద్యా విధానాలు అమలులో స్తంభించాయని, పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకాలు, విద్యార్థుల ప్రవేశాలపై కీలకమైన నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "పదవులు సామాజిక సమీకరణాల కోసం, పలుకుబడి ఉన్న వారి కోసం మాత్రమే ఇవ్వడమా? విద్యాభివృద్ధి ఎవరి బాధ్యత?"బానోత్ దేవేందర్ పేర్కొన్నట్లుగా, మంత్రుల ఎంపికలో చిత్తశుద్ధి ఉంటే, విద్యాశాఖను పక్కన పెట్టే ప్రసక్తే ఉండదన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే విద్యాశాఖకు సమర్థవంతుడైన మంత్రిని నియమించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల ముందు ఉద్యమాలు, దీక్షలు, విద్యార్థుల ఆందోళనలు ముదిరే అవకాశముందని హెచ్చరించారు. "విద్యాశాఖకు మంత్రి లేకపోవడం... ప్రభుత్వ నిర్వీర్యత కాదు ఇది విద్యావ్యవస్థపై ఉద్దేశపూర్వక దాడి!" పాఠశాలల్లో మౌలిక వసతులు లేవు, ఉపాధ్యాయుల కొరత తారాస్థాయిలో ఉంది, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ లో గందరగోళం పెరిగిపోయింది. కానీ ప్రభుత్వం మాత్రం ఈ కీలకమైన శాఖను పట్టించుకోకపోవడం విచారకరం. "తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టి, ప్రభుత్వాలు ఊరటగా ఉండవు!"

**PRINTED, PUBLISHED & OWNED BY** MANKALA DASU, H.NO, 3-8-289, Road No. 2 SURYODAYA COLONY , LB NAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor MANKALA DASU, RNI NO. **APTEL/2007/22828** CELL: 9705506999